

## ప్రశ్న - సమాధానం

బాబాకు మనకూ సంబంధం ఏమిటి?
గురువుగారితో మన అనుబంధానికి మూలం ఏమిటి?
ఋణానుబంధం అంటే ఏమిటి?
ఋణానుబంధం ఉంటే మనం ఎలా ఉండాలి?
ఏ కాలికి ఏ దారం కట్టి లాగితే ఈ పథానికి వచ్చాం?
సాయిపథంలో ఉండటం అంటే ఏమిటి?
సాయిపథంలో మనకు అడ్డాలు ఏమిటి?
మనకు మనమే అడ్డం కావడం అంటే ఏమిటి?
మనకు ఏం కావాలి?
మనం ఏం కావాలని అనుకుంటున్నాం?
అనుగ్రహం కోసం తపిస్తున్నామా?
మన తపనలకు అనుగ్రహం అని పేరు పెట్టుకుంటున్నామా?
బాబా చుట్టూ జీవితాన్ని అల్లుకోవడం అంటే ఏమిటి?
బాబా మీద ఆధారపడటం అంటే ఏమిటి?
ఆధారపడినపుడు జీవితం ఎలా ఉంటుంది?
నిజంగా ఆధారపడితే ఏం జరుగుతుంది?
ఆధారపడినపుడు మనం ఏం చేస్తాం?
ఆధారపడటానికి ఏం చేయాలి? ఏం చేయకూడదు?

నిశ్చింత అంటే ఏమిటి?
ఏ చింతా లేకపోతే మిగిలేది ఏమిటి?
నిశ్చింత లేకపోవడానికి కారణం ఏమిటి?
చింతలు చిగురించడానికి ప్రేరణ ఏమిటి?
ఆయన సమస్తాన్నీ ధరించే భరించే విశ్వగర్భుడని
మనకు తెలిస్తే, మనం తలిస్తే
ఏ అవ్యక్త భయమో జీవితాన్ని ఎందుకు శాసించాలి?
ఆయన ఆజ్ఞ లేనిదే ఆకైనా కదలదని నమ్మితే
అభద్రతా భావంలో ఎందుకు కొట్టుమిట్టాడాలి?
అంతటా అన్నింటా ఆయన నిండి నిబిడీకృతమైతే
మన జీవితంలోని అపరిపూర్ణతకు కారణం ఏమిటి?
మాటల్లో వినిపించే ఆదర్శాలు చేతల్లో కనిపించడం లేదేంటి?
ఆయన మనల్ని ఎన్నుకున్నాక మళ్ళీ మనం
ఆయనను వెతుక్కోవడం ఏంటి?
ఎక్కడిదాకా ఈ ప్రయాణం....
సాయిపథాన ఉన్నామన్న దానికి ఏమిటి ప్రమాణం?
ఎవరి ప్రశ్న వారిదే
ఎవరి సమాధానం వారికే.

- సద్గురుప్రేమ 'భీము'డు -

శ్రీసచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహారాజ్ కీ జై! సద్గురు శ్రీసాయినాథుని శరద్బాబూజీ కీ జై!



# గురుకృప

గురుపూర్ణిమ సంచిక



## నాకు తెలిసిన సాయిపథం...నాకు తెలిసిన బాబాపథం

"సాయిపథం" అంటే ఏమిటి? బాబాకు దగ్గరవడం అంటే ఏమిటి? నా మనసులో ఉండేటువంటి కాన్సెప్ట్ ఏమిటి? ఈ ప్రశ్నలని ఆవిష్కరించుకునే వేదిక 'సాయిపథం' సత్సంగం అనంటే. కానీ సత్సంగాలంటే పేజీలు లెక్కపెట్టుకొని పారాయణ చేయడాలు, బాబా ఫోటో ముందు కూర్చోవాలా, వెనక కూర్చోవాలా? స్నానం చేసి కూర్చోవాలా? స్నానం చేయకుండా కూర్చోవాలా? ఉదయం కూర్చోవాలా, సాయంత్రం కూర్చోవాలా? నిద్రపోయే ముందు కూర్చోవాలా? బెడ్ మీద కూర్చోని చెయ్యవచ్చునా, ప్రక్కన కూర్చొని చెయ్యాలా? పల్లకీ ఉత్సవం చేయడం,. అమెరికాలో పల్లకీ ఉత్సవాలట? I Can't understand this. ఇదే సాయిపథం అని మీరనుకుంటే నేను చేయగలిగినదేమీ లేదు. నాకు వాటితో కనెక్షన్ లేదు. నా దృష్టిలో నాకు ఉండేటటువంటి concept of Baba, బాబా యొక్క సత్సంగాలు ఇవి కావు. ఈ రిచ్యువల్స్‌కు అతీతంగా ఉండేటటువంటివి. ఏదైనా రిచ్యువల్ చేసినా, అది ఈ స్పిరిట్‌ను వెలిబుచ్చాలి. రిచ్యువల్స్ తప్పని నేనడం లేదు. కానీ ఈ స్పిరిట్‌ను వెలిబుచ్చుతుందా లేదా అని చూసుకోవాలి. అలా చేయకుండా మనలో ఈ ప్రశ్నలు ఉదయిస్తున్నాయంటే మనం సరైన పంథాలో పోవడం లేదు. అది సరైన పంథానో కాదో కూడా నాకు తెలియదు. నేను అనుకున్న పంథా మాత్రం కాదది. అది తప్పో, రైటో నాకు తెలియదు. అది సరైన పంథా కాదని మాత్రం ఎందుకనాలి? అయ్యిండవచ్చు. కానీ అది నాకు నచ్చిన పంథా మాత్రం కాదు. నాకు తెలిసినంతలో అది బాబాకు నచ్చిన పంథా కూడా కాదు. ఒక Spirit of Enquiry, ఒక understanding, దీని మీద బేస్ చేసుకున్నటువంటి సత్సంగం కావాలి. అంతే తప్పితే ఒక రొటీన్, ఒక రిచ్యువల్... దానివల్ల ఉపయోగం ఏంటి? దానివల్ల బాబా అనుగ్రహం వస్తుందని అనుకుంటే మాత్రం పొరపాటు. దానివల్ల రాదు. **మీలో అవగాహన ఎంత పెరిగితే దానికి అనుగుణంగానే మీకు బాబా అనుగ్రహం వస్తుంది.** ఎన్ని పేజీలు తిప్పాము సచ్చరిత్రలో? No. అట్లా పేజీలు తిప్పేటువంటి పారాయణ చేయకండి. అసలు పారాయణగా చెయ్యొద్దు పారాయణ. బాబా పట్ల మనకు కొన్ని ప్రశ్నలు మనలో unresolvedగా ఉండేటువంటి ప్రశ్నలను తెచ్చుకొని ఆ ప్రశ్నలకు సమాధానాలను వెతకండి ఆ పుస్తకంలో. ఒక రీసెర్చ్‌లాగా చేయండి. ప్రతి ఒక్కరూ ఒక ఎం.ఫిల్., పి.హెచ్‌డి. చేస్తున్నట్లుగా బాబా మీద పి.హెచ్.డి. చేస్తే ఎలా చేస్తారో అలా చేయండి. అలా చదవండి. చదివితే, చదవాలనుకుంటే, చదవమని కూడా నేను చెప్పడం లేదు. చదవడమే కరెక్ట్ అని చెప్పడం లేదు. చదవాలనుకుంటే అలా చదవండి. అంతే తప్పితే రోజుకు ఇన్ని పేజీలు, ఇన్ని అధ్యాయాలు పారాయణ చేయాలి. "వేలు అక్కడ పెట్టుకొని మరీ. ఫస్ట్ రావడం రావడం, మూడు అధ్యాయాలు అని లెక్కేసుకుంటాం. Third Chapter Endingలో చిటికెన వేలు పెడతాం. ఇక్కడి నుంచి చదువుకుంటూ పోతాం. ఇంక అప్పుడప్పుడు అలా చూసుకుంటుంటాం అన్నమాట. ఇంకా 20 పేజీలుంది. ఎందుకమ్మా ఆ ఖర్మ? నిజంగా చెప్పాలంటే దానిమీద వ్యక్తమయ్యేది బాబా పట్ల మీ ప్రేమ కాదు. అటువంటివాటి జోలికిపోవద్దు. అవి ఎలా చేయాలి, ఎట్లా చేయకూడదు? నన్ను అడగకండి. నాకు తెలియదు.



నాకు తెలిసిన బాబాపథం ఇది. మనలో అవగాహన, మనలో ఉండే మానవత్వం, మనలో ఉండే sense of responsibility, sense of obligation to ourselves, to the people around us, to the society.

ఈ కోపాలు, చికాకులు, ఒకడిని గురించి నెగిటివ్‌గా మాట్లాడటాలు, తిట్టడాలు, గాసిపింగ్స్... ఇవన్నీ చేస్తున్నామా, లేదా? ఎవరినీ ద్వేషించకుండా అసూయ, ద్వేషాలకు లోనవకుండా, హ్యాపీగా, ఆనందంగా జీవితం గడపడం. ఆ గడపడానికి అవసరమైన సరంజామాగా ఉండేటువంటి అవగాహనను పెంపొందించుకోవడం. వీటన్నింటికీ బేస్‌గా బాబా అనేటువంటి సెక్యూరిటీ, ఆ పోల్‌ను పట్టుకొని ఉండటం. ఇది నాకు తెలిసిన సాయిపథం. ఇంక మిగతావాటి గురించి నేను పట్టించుకోను. నాకు తెలియదు. అగరుబత్తి పెట్టాలా? అది పెట్టాలా? ఆరుగంటలకే సత్సంగం చేయాలా? ఏంటీ ప్రశ్నలు? అవి నాకు సంబంధించిన సత్సంగాలు కావు. అక్కడ ఉండేటటువంటి వాళ్ళు నాకు సంబంధించిన వాళ్ళే. మీరు ఆఫీసులో కూర్చొని చేసుకుంటున్నా నాకు సంబంధించినవాళ్ళే. రోడ్లో పోయినా నావాళ్ళే, సినిమా చూస్తున్నా నావాళ్ళే, అట్లాగే అక్కడ కూర్చున్నా నావాళ్ళు అవుతారు, అంతే. అంతకు మించి ఆ సత్సంగం మాత్రం నాది కాదు. ఆఫీసు నాది కాదన్నట్లు. మీరు పని చేసే ఆఫీసు నాది కాదు. ఇలా చేస్తే మాత్రం ఆ సత్సంగమూ నాది కాదు.

నేను మీకు ఇచ్చే ప్రాజెక్ట్ ఇది. ఈ ప్రాజెక్ట్ చేసినప్పుడు అది నా సత్సంగం. ఈ ప్రాజెక్ట్ వర్కవుట్ చేయండి. అవగాహన పెంచుకోండి. అదీ సత్సంగం అంటే, అదీ సాయిపథం అంటే. అదీ బాబా అంటే. మీకు వీటి మీద ఇంతకుముందు వేరే వేరే కాన్సెప్ట్స్ ఉంటే తుడిచేసుకోండి. వాటిమీద ఇష్టం ఉంటే చేసుకోండి, అది వేరే విషయం. నేను చెప్పేది అయితే...ఇది పాటించండి.

- శ్రీబాబూజీ



చిరునవ్వుతో రాజాకు స్వాగతం పలికారు స్వామి. అంతేకాదు ఆది ద్రావిడుల పరిస్థితుల గురించి దేశ రాజకీయ పరిస్థితుల గురించి రాజాతో చక్కగా చర్చించారు. స్వామివారి స్పష్టమైన అభిప్రాయాలు, విశ్లేషణాత్మక ఆలోచనా విధానాలకు సమ్మోహనుడై స్వామిని చూస్తుండిపోయాడు రాజా. స్వామివారు ఖచ్చితమైన అభిప్రాయాలను ఇలా తెలియచేసారు. “దేశంలోని పేదరికం తరిమివేయబడాలి. ప్రజలందరూ ఆనందంగా జీవించాలి. ధర్మాచరణను ఎవ్వరూ విడిచిపెట్టరాదు. ప్రశాంతత అన్నది భగవంతుని స్మరణతోనే లభించగలదు. శాంతిలేని జీవితాలలో కోర్కెలు – కోర్కెలకు ఆలవాలమైన మనుషులు, వ్యవస్థలు, దేశాలు చివరకు యుద్ధాలకు తలపడతాయి – భగవత్ స్మరణ వీటి నుండి మనలను దూరంగా ఉంచుతుంది” అని తెలియచెప్పారు. దేశసేవలో తానున్నంత కాలం స్వామివారి అభిప్రాయాలను మనసు నుంచుకొని పనిచేస్తానని మాట ఇచ్చాడు రాజా. రాజా కుటుంబం స్వామివారి నుండి సెలవు తీసుకునే సమయం ఆసన్నమైంది. కరుణాపూర్ణులైన పరమాచార్యులను విడిచిపెట్టే ఆ సమయంలో శ్రీమతి రాజా అప్పటి వరకు స్వామివారు నిలబడిన చోటు నుండి తన చేతినిండా మట్టిని (పాదధూళి) తీసుకొని చటుక్కున తన చీరకొంగున ముడిపెట్టుకుంది. కంఠం గద్గదమై – ఆనందాశ్రువులు రాలుతున్న ఆ ప్రతీక్షణాన్ని – స్వామివారి దివ్య దర్శనాన్ని అనుభవించి, పవిత్రమైన వారి పాదధూళిని స్వీకరించి సెలవు తీసుకుంది. ఊహించని ఈ పరిణామానికి రాజా, అక్కడ ఉన్న అంతేవాసులు ఆశ్చర్యపోయారు. తనకు ఈ ఆలోచన రానందుకు, తనకంటే తన భార్య ‘భక్తి’లో ముందున్నదన్న భావనకు కించిత్ ప్రేమాసుయలు కలగడం రాజాకు అనుభవమైంది.

మౌనంగా ఉండే మనిషి ప్రేమించలేడని కాదు, మాటలాడే మనిషి ఎంతో ప్రేమిస్తున్నాడని చెప్పలేము. ఊహలకందనిది మానవ మస్తిష్కం. అట్లాంటి మస్తిష్కాన్ని అదుపుచేయగల మహితాత్ముడు గురువు. మా గురుదేవులు శ్రీబాబూజీ శ్రీచరణుల చెంత ఎందరో విద్యాధికులు, సంపన్నులు, మేధావులు, పండితులు, విదేశీయులు, సామాన్యులు... ఇలా ఎందరెందరో ఆశ్రయించి వచ్చేవారు. కొందరు మాటలాడే వారు – ఎందరో మాటలకందని అవ్యక్తంలో ఉండిపోయేవారు. రూపానికి కొందరు, వారి ఆదర్శాలకు కొందరు, వారి ఆలోచనలకు కొందరు, వారి సాయిభక్తికి కొందరు, ఇలా వారి బహుముఖ ప్రేమ కోణాలకు అందరూ బానిసలే. ఆ మహితాత్ముని ప్రేమ మానసమే– మమ్ము అనుక్షణము గాచేది. వారి పూర్ణానుగ్రహమే మమ్ము పరిపూర్ణులను చేసేది–వారి పవిత్ర పాదధూళియే మాకు అనంతశక్తినొసగేది–వారి పావన నామమే మా చెడు తలపులను చెదరగొట్టేది. గురునామమే శరణు ... గురుచరణమే శరణు... గురురూపమే శరణు... శుభం భవతు...

– **గురుకృప**

**మనసా! విన్నావా గురుచంద్రుని మాట... చేరగలవు ఆనందపు పూదోట.**



సంపుటి : 22
సంచిక : 3



జూలై 16
2019

గురుకృప



# సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...

ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి!
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయకుహరంలోని నిశ్శబ్దనిశీథిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞానసౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి. ఆ సుజ్ఞానసౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృతధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృతధారలలో తడుస్తూ, ఆ జ్ఞానసౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ ‘సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!’
అని అందరూ ఏకకంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధురస్వప్నం.
ఆ స్వప్నసాఫల్యం కోసం శ్రీసాయినాథుని అనన్యప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించడమే మనం చేయగలిగింది, చేయవలసింది.

– శ్రీబాబూజీ

## లోపలి పేజీలలో



**పథగామి** – ఫణి **4**
**8** **‘ప్రగతి’ శీల గమనం - నిరంతర స్మరణం** – శేఖర్, చెన్నై
**గురువుగారి సాధనలో తొలి సోపానాలు** – శరశ్చంద్రికలు **9**
**22** **ముందుగా మనవి** డా।। జి.సాయివరప్రసాదరావు
**ప్రపత్తి** – శ్రీ నీలంరాజు లక్ష్మీప్రసాద్ **25**
**28** **గురుకృపాలహరి** – గురుకృప

నిర్వహణ : ***గురూజీ ఆశీస్సులతో – గురుబంధువులు***

**GURUKRUPA**
Printed at : Ramakrishna Printers, Visakhapatnam. Web : www.gurukrupa.info



# పథగామి

గురుపూర్ణిమ – ఆధ్యాత్మిక సాధనలో, కొన్ని సంప్రదాయాల్లో, ఒక సాధకుడికి ఎంతో ప్రాముఖ్యమైన, పవిత్రమైన రోజు ఇది. అలాగే ప్రతి నెలలో వచ్చే పౌర్ణమి రోజు కూడా సాధనా ప్రస్థానంలో చాలా ముఖ్యం. ప్రత్యేకించి ఈ మాసంలో వచ్చే ఈ పౌర్ణమి మాత్రం వ్యాసపూర్ణిమగా, గురుపూర్ణిమగా సుప్రసిద్ధం. ఈ గురుపూర్ణిమ యొక్క ప్రాముఖ్యత, ఆ ప్రాముఖ్యతకు గల కారణాలు ఏమిటి అనేది ప్రశ్న. ఆ ప్రశ్నలు, వాటి వివరాలు ఎన్ని ఉన్నా, బాబాను ప్రేమించేవారికి, వారితో ఋణానుబంధాన్ని పెనవేసుకున్న వారికి మాత్రం ఈ రోజు చాలా పవిత్రమైన పండుగ రోజు. ఎందుకంటే బాబాకై, బాబానే వారి అనుయాయులకు సూచించిన పండుగ ఇది. వారి అనుగ్రహధారలలో, ప్రేమ ప్రవాహంలో తడిసి ముద్దై, గుండెలనిండా వారి స్వస్వరూపాన్ని నింపుకోమని వారికి వారే అనుమతినిచ్చిన పర్వదినం ఈ గురుపూర్ణిమ రోజు.

బాబా వద్దకు రాకముందు, వారు తెలియక ముందు గురుపూర్ణిమ అనేది పెద్దగా పరిచయం లేదు. ఒకవేళ కర్ణాకర్ణిగా విన్నా గురుపూర్ణిమ అంటే, ఒక గురువుకు పళ్ళో, బట్టలో సమర్పించి, గౌరవించి వారి వద్ద ఆశీర్వచనం తీసుకోవడంగా మాత్రమే తెలుసు. ఆ పదానికి, ఆ రోజు ప్రాముఖ్యతకి మన జీవితాల్లో ఉన్న అర్థం, వివరం అంతవరకే. బాబా వద్దకూ, సాయిపథానికి వచ్చాక ఈ రోజుని ఎంతో పవిత్రమైన రోజుగా, ఉత్సవంగా, పర్వదినంగా జరుపుకోవడం ఒక చెప్పలేని అనుభూతి. గురుదేవుల సన్నిధిలో ఇటువంటి గురుపూర్ణిమలు సంవత్సరం సంవత్సరం జరిగాయి. అలా ఎన్నో గురుపూర్ణిమ మహోత్సవాలను వీక్షించి, పాల్గొన్న ఎన్నో అనుభూతులు మన హృదయం లోపలి పొరల్లో పదిలంగా నిక్షిప్తమయ్యాయి.

అటువంటి మహోత్సవాలు ఎన్ని సంవత్సరాలు జరిగినా ఆ గురుపూర్ణిమ ప్రాశస్త్యం విశిష్టత ఎంతమందికి తెలుసు? గురుదేవుల సన్నిధిలో ఉన్నామన్న సంతోషమూ, సంబరమూ తప్ప ఆరోజు యొక్క ప్రాముఖ్యత ఎంతమందికి అవగతం అయ్యింది? ఈ ప్రశ్నలన్నీ ఎందుకంటే, క్రమపద్ధతిగా శాస్త్రాధ్యయనం చేసి, చెవిలో ఏదో ఒక మంత్రాన్ని ఊదమని, అనుగ్రహించమని వేడుకోవడానికి మనమేమన్నా చెప్పింది తు.చ. తప్పక పాటించే ఉత్తమ శిష్యులమా? వారిని గురువు అని అనుసరిస్తున్నాం అనుకోవడానికి. ఎన్నెన్నో కోరికలతో సతమతమవుతూ అవి తీరడానికి అనేకమయిన మ్రొక్కులు మ్రొక్కుతూ ఆశగా ఎదురుచూడడం లేదు–వారిని దైవమని కొలుస్తున్నాం అనుకోవడానికి.





ఇల్లు ఎక్కడ' అని అడిగారు. అంతే కాదు – "మరో అర్ధగంటలో మీ స్వగృహానికి వస్తాను – ఏర్పాట్లు చేసుకో" అన్నారు. అప్పుడు తెలిసింది అతని మౌనవినతులేమిటో. అతని ఆనందానికి అవధులు లేవు. మనసులో కొలువై ఉన్న సజీవ దైవానికి విన్నవించేదేముంది? వారికి వినిపించేటట్లు చెప్పడంతో మాత్రమే మనోకామనలు తీర్చుకోవలసిన అగత్యమేముంది? చేష్టలుడిగిన ఆ వైద్యుడు అర్ధగంటలో ఏర్పాట్లు ఎలా చేసుకోగలనన్న సందేహంలో ఉండగానే " ఇంటికి వెళ్ళి నీవు నిశ్చింతగా ఉండు. మఠవాసులు కావలసిన ఏర్పాట్లన్నీ చూసుకుంటారు" అని అభయమిచ్చారు స్వామి. స్వామివారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికిన ఆ కుటుంబాన్ని అక్షతాశీర్వచనములిచ్చి దీవించారు స్వామి. తాన మానసముననే నిలిచిన ఆ ఆరాధ్యమూర్తికి మౌనంగా చేసుకున్న నివేదనకు – గురుచంద్రుని దీవెన వరప్రసాదమైన ఆ క్షణాలలో ఆనంద పారవశ్యంతో ఆ వైద్య శిరోమణి తన ప్రేమాశ్రువులనే దక్షిణగా సమర్పించి తరించాడు. గురువు మన జీవితంలోనికి ప్రవేశించారన్న ఎరుక లేనంతవరకే చింత. ఒక్కసారి ఆయన పాదాశ్రయము దొరికాక బ్రతుకంతా నిశ్చింత. స్వామివారి సర్వవ్యాపకత్వాన్ని తెలియచెప్పే ఎన్నో లీలా వినోదాలలో ఇదొక పూజా పుష్పమే!

నిత్య జీవితంలో ఎన్నో రకాల పరిస్థితులు, ఎందరో వ్యక్తులు, ఎన్నో భిన్న మనస్తత్వాలతో కలిసి ముందడుగు వేయాల్సి వస్తుంది. గురువు సాధకుడే కాదు, ఆనందజీవన ప్రబోధకుడు. మనం పరిస్థితులకు, సంఘటనలకు స్పందించకుండా ఆ సంఘటనలోని వ్యక్తుల పట్ల ప్రతిస్పందిస్తుంటాం. మనలో ఎంత పరిణతి వచ్చిందో తెలియాలంటే ప్రతికూల పరిస్థితులలో మన ప్రవర్తన ఎలా ఉందో – ఉండాలో తెలియాలంటే ఈ క్రింది అనుభవాన్ని గమనించాల్సిందే!

అది 1933వ సంవత్సరం. గాంధీజీ నేతృత్వంలో కొందరు రాజకీయ నాయకులు కలిసి ఆలయాలలో హరిజనులకు ప్రవేశాన్ని కల్పించాలని చాలా బలంగా తమ వాదనలను వినిపిస్తూ వస్తున్నారు. తమ పీఠ పరంపరాగతంగా ఉన్న ఆచారాలు, కట్టుబాట్లు అనుసరించి స్వామివారు అందుకు కావలసిన పరిస్థితులు, పాటించవలసిన మర్యాదలు తెలియచెపుతూ కొన్ని చర్యలు మనకు పాపమును మూటగట్టుకునే స్థితిని కల్పించగలవని స్పష్టంగా చెప్పిన పరిస్థితులు. అలాంటి గడ్డు సమయంలోనే హరిజన నాయకుడైన ఎం.సి.రాజా స్వామివారు విడిది చేసిన తిరుమంగళం పలకల ఫ్యాక్టరీకి విచ్చేసాడు. స్వామివారితో వాదించాలన్న తలపేమీ తనకు లేదు. తనకు స్వామిని దర్శించి, ఆశీస్సులు తీసుకోవాలని కోరిక. స్వామివారి తేజోమయమైన వర్చస్సుకు, కరుణ కురిపించే వారి అమృత వాక్కులకు దాసోహమయ్యాడు రాజా. తాను అఖిల భారత ఆది ద్రావిడ సంఘ కార్యదర్శిగా పనిచేసిన కాలంలో హరిజనుల కోసం ఎంతో చేసాడు రాజా. ఎప్పటిలాగే తమ సహజ సౌందర్యమైన



# గురుకృపాలహరి

గురుదేవా! ఏమని ప్రస్తుతించగలము మీ కృపా విశేషములను. మీ అవ్యాజ ప్రేమను వర్ణించగలిగిన అక్షర సముదాయము, సంపత్తి మాకు ఎట్లా లభించగలదు. సాక్షాత్తు వ్యాసమహర్షి అంతటివారే 'నేతినేతి' అంటూ చెప్పిన ఆ అనిర్వచనీయ అనుభూతియే కదా మీ అనుగ్రహము, ఆశీర్వచనము. అట్టి ఆ అనిర్వచనీయ అనుభూతికి అక్షర రూపమంటే అది సాధ్యమయ్యేనా? మీ రూప దర్శనం చేసినంతనే కదా 'అవ్యక్త'మంటే అవగతమయ్యింది. మనసు అల్లకల్లోలమై. అంతలోనే నిశ్చలమై, మరింతలో మీరే మాకు దిక్కు అని అర్థమై మీ ప్రేమ పొత్తిళ్ళలో మా జీవితాలు మధురపర్వంగా సాగుతున్నాయి. దేవా! **"మహాత్ముల చరిత్రలు ఆధ్యాత్మిక జీవితానికి జీవగర్రలు, మహత్తర ఆధ్యాత్మిక గమ్యానికి మార్గం చూపే వెలుగుదివ్వెలు. భక్తి, జ్ఞాన వైరాగ్యాలకు సజీవ రూపాలు, కార్యసాధనలో స్ఫూర్తినిచ్చే రసస్ఫోరకాలు, అద్భుత ఆధ్యాత్మిక జీవిత హర్మ్యానికి ప్రధాన ద్వారాలు"** అని మీరు చెప్పిన మాటల మననం గురుస్వరూపాన్ని, గురుకృపా విశేషాన్ని మరింత శోభాయమానంగా దర్శింపచేస్తున్నాయి.

పరమాచార్యస్వామివారి జీవిత చిత్రణ మహదానందపర్వంగా సాగుతోంది. జగద్గురువుల సమర్థత్వం, సర్వజ్ఞత, సర్వవ్యాపకతలు, తూనికలేని అనంతకరుణకు ఆలవాలములని అర్థమవుతున్నది. స్వామివారి జీవిత విశేషములను ఏ పరి పరికించినా ఎవరికి వారికి వారి "గురుస్వరూపము" యొక్క విశ్వరూప సందర్శనము కలుగునని చెప్పడం అతిశయోక్తి కాదు. "నేర్చుకోవాలనే దృక్పథమే ఉంటే నిత్యజీవితంలో జరిగే ప్రతి సంఘటన సద్గురు లీలా ప్రబోధమే" అన్న పూజ్య గురుదేవుల మాటలు మదిలో ఉంచుకుంటే గురుకరుణ అవగతమవుతుంది, గురుని ఆచరణ బోధపడుతుంది – గురుస్వరూపం మదిలో పొదగడుతుంది. "మూకం కరోతి వాచలం" అన్నట్లు అవధరిస్తున్న ప్రతీ అక్షరం మూగవానితో గురువు పలికిస్తున్న మాటలని – అసంగతములైన విషయములు స్వప్రేలాపనలని విన్నవించుకుంటూ 'కంచి' కథలోనికి వెళ్దాం.

పరమాచార్యుల చెన్నై విడిది గురించి వారి అనుగ్రహ భాషణాల గురించి గత శీర్షికలో ప్రస్తుతించుకున్నాం కదా! స్వామివారి సర్వజ్ఞత్వాన్ని – స్వామివారి దయామృత మానసాన్ని దర్శింపచేసే సంఘటన. చెన్నైలో ఒక పేరున్న వైద్యుడు ప్రతీరోజూ స్వామివారిని దర్శించుకుంటున్నారు – చెన్నైలో విడిది చేసిన సమయంలో. ఏ రోజూ స్వామివారి చెంతన నోరు విప్పలేదు. స్వామికి తన కళ్ళతో, మనసుతో ఆర్తిగా ఏదో విన్నవించుకుంటున్నాడు, ప్రతిరోజూ దర్శన సమయంలో. ఆ వైద్యుని విన్నపాలేమిటో ఎవరికీ తెలియదు. ఒకనాడు ఆశ్చర్యంగా స్వామివారు ఆ వైద్యుని 'మీ





ఎందరో భాగవతోత్తముల కథలు విన్నా, ఆనందించినా మనమేమీ భక్తులం కాదు వారిని భగవంతుడు అని ఆరాధించడానికి. వారసత్వపు ఓనమాలలో, జీవితాన్ని నడిపే భావజాలం–ఆ భావజాలం చిందించిన, అందించిన జీవితపు విలువలను పాటించడంలో గెలుపు ఇంకా రాలేదు–వారిని పితృసమానులుగా అభివర్ణించుకోవడానికి. ప్రేమ నిండిపోయిన హృదయాన, కృతజ్ఞత విశ్వాసాలతో అభిమానించే వ్యక్తికోసం ఏదైనా గుడ్డిగా చేయగల తెగువ, స్వామిభక్తి లేదే–వారిని మన యజమాని అనుకొని జబ్బలు చరుచుకోవడానికి. చెప్పింది చెప్పినట్లు పాటించడం కన్నా అనుగ్రహ ప్రసాదితంగా ఉన్న అనుభవాలను, అనుబంధాన్ని గొప్పలకు ఊరికే చెప్పుకోవడానికి కాలం వినియోగిస్తుంటే హృదయం వికసించే అనుభవాలు రావడం లేదే ఇంకా వారితో ఋణానుబంధం మరింత కొనసాగుతుందని ఆశించడానికీ, ఆనందించడానికీ.

ఇలా ఏ బంధమని ముడి పెట్టుకుందామనుకున్నా వారితో ముడిపెట్టుకున్న ఆ బంధానికి పేరు పెట్టుకుందామనుకున్నా ఇదే వరుస. ఏ పేరు పెడదామన్నా తెలిసీ తెలియని ఏదో ఒక లోపం మనస్సును ఆవరిస్తోంది, అలా కట్టిపడేసి ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. అయినా పేరు పెట్టుకోకపోతే ఏమి? వారితో బంధం లేదా? ఆ బంధంలో ప్రేమ లేదా? ఊపిరిసల్పనీయక నిశ్చలమయ్యే కాలగతి ప్రతిష్టంభన మన అనుభవమేనా? ఎంత ప్రయత్నించినా పురుడు పోసుకొని ఆలోచనలు, ఇతరములపై మచ్చుకైనా పోని మనస్సు మన అనుభవమేనా? మనదంటూ ప్రత్యేకమైన ఆశ, కోరిక, ఇష్టాయిష్టాలు లేకుండా ఏకాత్మభావంలో లయించిపోవడం మన అనుభవమేనా? ఈ అనుభవాలన్నీ ఆధ్యాత్మిక అనుభవాలా? ఊహాజనితాలా? చదువులు నేర్పిన మాటలా? ఇదంతా నిత్యసత్యమైన ప్రేమానుభవం కాక మరేమిటి? ఈబంధం పేరు లేని విశిష్టమైన ప్రేమబంధం కాక ఇంకేమిటి? మొత్తానికి ఆశ్చర్యాన్ని కలిగించే ఆకర్షణే వారితోటి మన ప్రేమ ఉదంతం. ఎప్పుడూ వారి వద్దనే ఉండాలనిపించే ఆ ఆకర్షణ వారికే స్వంతం. చూసేకొద్దీ చూడాలనిపించే వారి రూపమది ఆద్యంతం. ఎప్పుడూ వినాలనిపించే వారి మాటలకు మంత్రముగ్ధమవదా లోకం సమస్తం. ఇదంతా అనుభవించాల్సిందే ఆసాంతం. ఇలా మనకు ఏ మాత్రమూ గురుపూర్ణిమ గురించి తెలియకున్నా వారి చల్లని అనుగ్రహవెన్నెలను కురిపించి మేనిపై, భూమిపై, ఆకాశంపై, అన్నింటిపై మెరిపించి ఇంతటి ఆనందాన్ని అనుభవాన్ని ప్రసాదించి ఎన్నో అనుభూతులతో మైమరిపింపచేసారు గురుదేవులు. ఇదంతా వారి ప్రేమ మహిమే కానీ, మనలోని పాత్రత ఏ మాత్రమూ కాదు. అందుకే ఈ బంధానికి ఏ పేరూ లేదు



– ఈ బంధంలోని ప్రేమకు ఏ హద్దూ లేదు.

మన మనస్సులో ఉండే మాలిన్యాలు, లోపాలు ఆ గురుచంద్రుల పరిపూర్ణరూపాన్ని ఆసాంతం దర్శించనీయకుండా చేస్తున్నాయి, వారి అనుగ్రహ వర్షధారలకు గొడుగై అడ్డు పడుతూనే ఉంటాయి. ప్రతిరోజూ కనిపించినా ఆ చందమామ పరిపూర్ణంగా స్పష్టమయ్యేది మాత్రం పౌర్ణమిరోజే. అందుకే ప్రకృతి ప్రసాదితంగా ఈ రోజున మన మనస్సుపై ఉండే ఆ పౌర్ణమి ప్రభావం అంత విస్పష్టంగా ఉంటుంది. శరీరంపైన పడిన మాలిన్యాన్ని ప్రతిరోజూ నీటితో శుభ్రం చేసుకునే చందంగా, ఆ సద్గురుని అనుగ్రహధారలలో మన మనస్సులోని మాలిన్యమూ శుభ్రమవుతునే ఉంటుంది. దాన్ని గుర్తెరిగి సాయిపథంలో మరింత ముందుకు సాగే ప్రయత్నం మరింతగా మనవైపు నుండి జరుగుతూనే ఉండాలి. ఆ ప్రయత్నం ప్రతిక్షణం జరుగుతుందా? లేదా స్నానమాచరించినట్లు ప్రతిరోజూ జరుగుతుందా? లేదా నెలకోసారి నిండువెన్నెల్లో ధవళకాంతుల దర్శనంలా పౌర్ణమిరోజు జరుగుతుందా? లేదా సంవత్సరంలో వచ్చే ఒక పవిత్రమైన గురుపూర్ణిమరోజున జరుగుతుందా? లేదా అసలు జీవితం మొత్తం మీద ఒక్కసారే జరుగుతుందా? అనేది గురువు అనుగ్రహం–మన ఆర్తి, అవసరంపై ఆధారపడి ఉంటుంది.

అంతులేని ఆనందానుభవం అనే వినీలాకాశంలో పరిపూర్ణంగా ప్రకాశించే నిండుచంద్రుడనే ముగ్ధమనోహరుడైన గురుదేవులు సంపూర్ణంగా సాక్షాత్కరించగా, మనస్సులోని కోరికలు, వేదనలనే మబ్బులు అనుగ్రహానుభవాల ఉద్వేగంతో నిండిపోయి, భావోద్వేగాలుగా వర్షించి, అటుపై ఆ గురుచంద్రుని రూపం ఆసాంతం ప్రకాశిస్తూ మురిపించి మైమరిపించగా, హృదయాంతరాళాల్లో ఉండే మాలిన్యాలు, లోపాలు ఆ రూపాన్ని మన కళ్ళకు తిరిగి మసకబారించగా, నిండుపున్నమి పండువెన్నెల, ప్రేమ పరవశపు అనుగ్రహ ప్రకాశంలో ఆ మాలిన్యాలన్నీ స్పష్టమవుతూ, దగ్ధమవుతూ బాహ్యాంతరాలలాల చూపులకు పూర్ణమైన, సంపూర్ణమైన ఆ గురుచంద్రుల రూపం, స్వరూపం సాక్షాత్కరించదా? ఆ ఆనందానుభవంలోనే మనల్ని తిరిగి ముంచి తేల్చదా? ఆ అద్భుతఘట్టం, ఆ పరిపూర్ణమైన అనుగ్రహకాలమే ఈ పౌర్ణమి కాలం – గురుపూర్ణిమ పవిత్ర ఘడియలు.

అయితే ఇక్కడ ఒక విషయ ప్రస్తావన అప్రస్తుతం కాదనిపిస్తుంది. కొన్నేళ్ళ క్రితం ఒకరు నాతో చెప్పారు గురుపూర్ణిమను సాయిభక్తులందరూ ఒక కొత్త సంవత్సరానికి తొలిరోజుగా జరుపుకుంటే బాగుంటుందని, నాకూ అనిపించింది. మొదలెక్కడో తెలియని ప్రయాణంలో మరువలేని మలుపుల





వెళుతున్నారు.

ఈలోగా అలికిడికి భవనంలోని వారు మేల్కొన్నారు. ఇంట్లో దొంగతనం జరిగిందని గ్రహించి పోలీసులకు తెలియచేసారు. పోలీసులు ఇటూ అటూ వెతికి చివరకు మూట మోసుకుపోతున్న మనిషికీ, వెనుకాల నడుస్తున్న ఆ ఇద్దరికీ తారసిల్లారు. పోలీసుల్ని చూడగానే దొంగలు కాలికి బుద్ధి చెప్పారు. పోలీసులు మూట మోసుకు వెళుతున్న మనిషిని స్టేషన్‌కు తీసుకొని వచ్చి ఆ రాత్రికి అతడ్ని అక్కడే పరుండనిచ్చి, మర్నాడు మేజిస్ట్రేట్ ముందు హాజరు పరిచారు. చెట్టుకింద చేనేతవాణ్ణి దొంగతనం ఆరోపణపై పోలీసులు అరెస్టు చేసారని ఊరంతా తెలిసింది. అందరూ ఆశ్చర్యపోయారు. “ఈ దైవభక్తుడు ఇలాంటి పనిచేయడే. ఏమి జరిగిందో” చూద్దామని చాలామంది కోర్టుకు హాజరయ్యారు. విచారణ ప్రారంభమయింది. పనివాడి తరపున వాదించే వకీలెవరూ లేదు. అంతకుముందు రాత్రి ఏమి జరిగిందో చెప్పమని మేజిస్ట్రేట్ పనివాణ్ణి ఆదేశించారు.

అతడిలా చెప్పనారంభించాడు “దైవేచ్ఛ ననుసరించి నిన్న రాత్రి నా భోజనం పూర్తయిన తర్వాత అలవాటుగా చెట్టుకింద పడుకొని నిద్రించాను. నడిరాత్రివేళ, దైవేచ్ఛననుసరించి ఇద్దరు మనుషులొచ్చి నిద్రలేపారు. దైవచ్ఛగా వారు నా తలమీద ఒక మూటమోపి తమతోటే రమ్మన్నారు. కొంతదూరం నడిచిన తర్వాత దైవేచ్ఛ వలన పోలీసులు ఎదురొచ్చారు. దైవేచ్ఛ కారణంగా నా వెంటనున్న వారు పట్టుబడకుండా పరుగెత్తిపోయారు. దైవచ్ఛగా పోలీసులు నన్ను అరెస్టు చేసి రాత్రి స్టేషనులో ఉంచి, ఇవాల్టి వేళ మీ ముందరికి తెచ్చారు. దైవేచ్ఛ ననుసరించి మీరు నన్ను ప్రశ్నిస్తున్నారు” అని జరిగిన విషయమంతా, ఉన్నదున్నట్లు, పూసగ్రుచ్చినట్లు విన్నవించుకున్నాడు.

మేజిస్ట్రేటుకు తగని నవ్వు వచ్చింది. కానీ కోర్టులో తన గాంభీర్యం కోల్పోదలచుకోలేదు. ఆ చేనేత పనివాడి మాటలు వింటుంటే మాత్రం అవన్నీ సత్యంగా కనిపించాయి. అసలు దొంగ ఇతడయి ఉండే అవకాశం లేదని గ్రహించి అతడిని విడిపించేసారు. పనివాడు కోర్టు వెలుపలికి వచ్చినపుడు, అతడి శ్రేయోభిలాషులు “ఏమి జరిగిందని?” అడుగగా “దైవేచ్ఛ కారణంగా నన్ను వదిలేసారు” అని సమాధానమిచ్చాడు. మొదట్నుంచి చివరి వరకు ఆ పనివాడు ప్రతిఘట్టంలోనూ దైవేచ్ఛనే చూసాడు. ఏ సమయంలోనూ ఆందోళనకు గురికాలేదు. తనని తాను భగవంతుడి చేతులలో పెట్టేసుకొని నిశ్చింతగా ఉండిపోయాడు. కథ కాస్త హాస్యంగా కనిపించినా ప్రపత్తి, శరణాగతి అంటే ఇదే మరి. తన ఇచ్ఛ అనేది లేకుండా అంతా ఈశ్వరేచ్ఛ మీద వదిలేసి బతికే వాని స్వేచ్ఛ, ఆనందం, ఎటువంటివో మనవంటి వారికి ఎలా తెలుస్తుంది? – ***ఆలోకన 2 : శ్రీ నీలంరాజు లక్ష్మీప్రసాద్***



జరిగే ప్రతి సంఘటన సద్గురులీలా ప్రబోధమే. మనల్ని ఆయనకు చేరువ చేసుకునే ప్రణాళికలో భాగమే అంటారు శ్రీబాబూజీ). పూర్తి ఎరుకతో ఇలా నేర్చుకుంటూ, బ్రతికే మనిషిలో 'నేను, నాది' అనేది ఘనీభవించే అవకాశం ఉండదు. ఎప్పటికప్పుడు అతడి మనస్సు నిర్మలంగా ఉంటుంది. అలాంటి పరిశుభ్రమైన, స్వచ్ఛమైన మనసులోనే 'అది' తాండవిస్తుంది.

దైవాన్నే నమ్ముకొని, అది తనని నీటముంచినా, పాలముంచినా సణుక్కోకుండా అచంచల విశ్వాసంతో జీవించిన ఓ చేనేత పనివాడి కథ చెప్తారు కేరళలోని ఆనందాశ్రమ స్థాపకులైన స్వామి రామదాస్. ఆ పనివాడికి సంసారం లేదు, ఒంటరివాడు. ఇల్లనేదే లేనందువల్ల ఓ చెట్టుక్రింద నివసిస్తూ మగ్గం పని చేసుకుంటుండేవాడు. బట్ట తయారైన తర్వాత దానిని బజారుకు తీసుకుని వచ్చి, కల్లాకపటం ఎరుగనివాడు కాబట్టి 'తాను నూలుకెంత ఖర్చు చేసాడు, ఇతర ఖర్చులింకా ఏమేమి పెట్టాడు. తన లాభం ఎంత వేసుకున్నాడు' అనే వివరాలన్నీ ఉన్నవి ఉన్నట్టు చెప్పి 'బట్ట ఖరీదింత' అంటూ అమ్మేసేవాడు. ఈ మనిషి సరళహృదయుడని, దైవభక్తుడని తెలుసుకున్న వారు అతడడిగినంత ఇచ్చేసి కొనుక్కొనేవారు. ఆ డబ్బుతో మరి కొంత నూలు, ఇతర వస్తువులు కొనుక్కుని, మిగిలిన డబ్బుతో తాను జీవించడానికి అవసరమైన వస్తువులు కొనుక్కుని చెట్టుకిందనే వండుకుతింటూ బతుకుతుండేవాడు.

అతడు ఉండే ఆ చెట్టు ఎదురుగా ఓ ధనికుడి భవనముండేది. ఒకనాటి రాత్రి చేనేత పనివాడు విశ్రమించిన తర్వాత, ఇద్దరు దొంగలు ఆ ధనికుడి భవనంలోనికి ప్రవేశించి నగా, నట్రా, విలువైన దుస్తులూ దొంగిలించారు. వాటినన్నింటినీ ఓ మూటగా కట్టుకుని, ఎలాగో మెల్లగా మోసుకుంటూ బయటికి వచ్చారు. ఆ కటిక చీకట్లో అక్కడికక్కడే పంచుకోవడం వారికి కుదరలేదు. బరువైన ఆ మూటను ఎవరు మోయాలి అనే విషయం తెమలక ఇద్దరూ వాదులాడుకోవడం మొదలెట్టారు. చెట్టుక్రింద నిద్రిస్తున్న పనివాణ్ణి చూసి 'వీడెవడో అమాయకుడిలా ఉన్నాడు' అని వాణ్ణి లేపి, మూట వాడి తలమీద పెట్టి మోసుకురమ్మంటూ బయలుదేరారు. ఎవరికి సహాయం చేయడానికైనా ఏనాడూ వెనుకాడని ఆ పనివాడు మారుమాటాడకుండా, అది మోసుకుంటూ వారితో బయలుదేరాడు. వారు దొంగలై ఉంటారనే విషయం కూడా అతడికి తట్టలేదు. వారెవరో కనుక్కుందామనే ఆసక్తే అతడికి లేదు. "మూట మోస్తూ నువ్వు ముందు నడవ"మని దొంగలిద్దరూ వెనుక నడుస్తూ





పరుగులకు అలవక చిట్టచివరి మజిలీ చిత్ర రహస్యాలను ఛేదించాలని, అక్కడ చేరి ఆనందమయ విశ్రాంతిని వారి సన్నిధిలో పొందాలని తలపోసే ప్రతిమదికో పెద్ద పరీక్షే. ఎందుకు పరీక్ష అంటే సూత్రప్రాయంగా మనం పెట్టుకొని చేరాలనుకొనే గమ్యం ఏదైనా, ఊరించే ఊహలు ఎంతటివైనా, అవి ఏ వైపుకు మనల్ని నెట్టివేస్తున్నా, వాస్తవమయిన మన అనుభవం తద్భిన్నంగా ఉండి సందిగ్ధంలో పడవేస్తూనే ఉంటుంది. ఎందుకంటే మన ప్రయాణంలోని మజిలీలు అవి. మదిని నింపిన మధురానుభవాలు మాత్రమే సత్యం. అనునిత్యం అనుభవైకవేద్యమయిన ఆ అనుభవాల స్రవంతులే మన హృదయంలో అనుగ్రహమనే మొక్కలుగా మొలిచి వాటికి అనుభూతులనే కొమ్మలుగా పెరిగి, ఆ కొమ్మలకు పరివర్తనా కుసుమాలు కస్తూరీ పరిమళాలను వెదజల్లుతూ పూయగా, ఆ హృదయమంతా ప్రేమానురాగాల పూదోటలుగా, భక్తి వాత్సల్యాల ఉద్యాన వనాలుగా మనోహరంగా మారి ముస్తాబై, ఆ ప్రేమమూర్తి యొక్క రాకకై ఎదురుచూడదా? వేంచేశాక వారిని అక్కడే కొలువై ఉండమని ప్రార్థించదా? అలా వారు కొలువై ఉన్న ఆ హృదయంలో మన గమ్యం, లక్ష్యం మన ముందే సాక్షాత్కరించి మరింత స్పష్టమవదా? అలా మన లక్ష్యం, గమ్యం సుస్పష్టంగా గోచరమయ్యే వరకు అటువంటి సందిగ్ధమైన మదిలో ప్రయాణాలు, మజిలీలూ మనకు కాలగమన నేపథ్యంలో సంవత్సరాలుగా, నెలలుగా, రోజులుగా అనుభమవుతూ ఉన్నాయి. అందుకే జీవిత కాలచక్రంలో తిరిగి తిరిగి వస్తున్న ఈ సంవత్సరాలు, వాటి తాలూకు అనుభవాల సంస్మరణ–ముందు సంవత్సరాలకు మరింత ఉత్సాహాన్ని, సంకల్పబలాన్నీ ఇస్తుంది. కేవలం వేడుకల్లా మాత్రమే కాకుండా సరిక్రొత్తగా ఉత్తేజాన్ని నింపుకొని, లక్ష్యశుద్ధితో సాయిపథాన ముందుకు సాగేలా చేస్తుంది. అలా చల్లని దీవెనలతో అందరినీ అనుగ్రహించమని ఆ సాయినాథుని ప్రార్థిస్తూ.... **గురుపూర్ణిమ క్రొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్నాము సాయిభక్తలోకానికి.**

**– 'గురుకృప' కోసం ఫణి**

**బ్రతికినన్నినాళ్ళు ఫలములిచ్చుటె గాదు! చచ్చి కూడా చీల్చి ఇచ్చు తనువు!**
**త్యాగభావమునకు తరువులే గురువులు! లలిత సుగుణజాల! తెలుగుబాల!**

భావం : చెట్లు బతికి ఉన్నంతకాలం మనకు పండ్లును ఇస్తాయి. చచ్చిపోయిన తరువాత కూడా వాటి కలప మనకు ఉపయోగపడుతుంది. చెట్లే మనకు గురువులుగా త్యాగభావాన్ని నేర్పుతాయి.



## 'ప్రగతిశీల' గమనం – నిరంతర స్మరణం

చాలా కాలం కిందట ఎవరో చెప్పగా గుర్తు... సద్గురువుతో మనకు ఉండే contact యొక్క స్వభావం dynamicగా ఉంటుంది. అది static కాదు అని. అంటే అది నిరంతర గతిశీలమైనది అని... స్థిరమైనది కాదు అని అర్థం. ముందుగా అసలు ఈ dynamic అన్న స్వభావం గూర్చి ఆలోచిద్దాము. గతిశీలము అంటే అది ఎల్లప్పుడూ 'గమనం'లో ఉంటుందనే కదా అర్థం. మరి 'గమనం' అన్న ప్రక్రియలో ఉండేవి రెండే... ఒకటి పురోగమనం.... రెండోది తిరోగమనం... ఇక్కడ జాగ్రత్తగా గమనించవలసిన అంశం ఏమిటంటే.... dynamic అన్నాక ఈ రెండూ తప్పితే మూడవది ఉండదు.... అంటే ఉన్న చోటే ఉండటం అన్నది ఉండదు. అంటే .... పెరగలేదంటే.... జరిగేది తగ్గటమే.... అదే Level Maintain అవ్వటం అంటూ ఉండదు. ఇందుకు ఒక ఉదాహరణ తీసుకుందాము. మనం కారో, స్కూటరో, డ్రైవ్ చేస్తున్నామనుకోండి Accelerator press చేసి ఉంచినంత వరకే ఆ speed maintain అవుతుంది. ఒక్కసారి Accelerator ఆపితే బండి వెళుతూ ఉంటుంది. కానీ ఆ speedలో మాత్రం కాదు. speed తగ్గిపోతుంది. క్రమంగా బండి ఆగిపోతుంది. ఈ అవగాహనతో ఇప్పుడు సద్గురువుతో మనకుండే contact గురించి ఆలోచిద్దాము. పైన పేర్కొన్నదాని ప్రకారం, గురువుతో మనకుండే contact కూడా ఆ విధంగానే అయితే పెరుగుతూ ఉండాలి, లేనిపక్షంలో automaticగా తగ్గిపోతుంది. అది ఒకే levelలో maintain అవ్వడం అంటూ ఉండదు. మనం ఆయనకు ఎన్ని సంవత్సరాల నుండి తెలుసు... ఆయనతో ఎంతకాలం నుండి మనకు సాన్నిహిత్యం ఉంది... ఆయనతో మనకు ఎన్ని అనుభవాలు ఉన్నాయి. మొదలైన విషయాలు మనకు మహదానందాన్ని కలిగించేవే... ఏదో తెలియని సంతృప్తిని... ఒకింత గర్వాన్ని కలిగించేవే... సందేహం లేదు. అయితే, ఈ విషయం ఎంత సత్యమో... ఆయనతో contact అనేది–ఒకసారి సంపాదించి అట్టి పెట్టుకొనే వస్తువు కాదన్నది కూడా అంతే సత్యం. అదేమీ ఆస్తి కాదు, ఒక్కసారి పోగేసి జీవితాంతం అనుభవించేందుకు.... అదేమీ డిగ్రీ కాదు.... పాసై... జీవితాంతం గౌరవంగా చలామణి అయ్యేందుకు....అదో నిరంతర ప్రక్రియ ..... నిన్నటి స్ఫురణ.... నేటి స్మరణకు దారితీయాలి, రేపటికి స్ఫూర్తినివ్వాలి. ప్రతీరోజు, ప్రతీనిమిషం, ప్రతీక్షణం, ఆ సత్పదార్థంతో, సత్యంతో, సద్గురువుతో ఇంకా ఇంకా contact పెంచుకోవాలన్న ప్రయత్నం జరగాలి. There is nothing 'static' with Sadguru, everything is ec'static'.....

– *శేఖర్, చెన్నై*





## ప్రపత్తి

ప్రపత్తి అనుకున్నంత తేలికైన విషయం కాదు. మనిషిలోని అహం దాదాపు బాల్యావస్థలోనే ప్రారంభం కావడానికి చుట్టూ ఉన్న సమాజం దోహదం చేస్తుంది. పరస్పరాధారభూతమైన ఈ జీవరాశుల్లో ఆ బాలుడ్ని ప్రత్యేకంగా విడదీస్తాం. అతడికీ, చుట్టూ ఉన్న ప్రకృతికి అవినాభావ సంబంధాన్ని తెలియచేసే బదులు, పిల్లవాడికి మాటలు రాకముందే నీ ముక్కేది? నీ కళ్ళు? నీ నోరు, నీ చేతులు అంటూ నేర్పుతాము. అలా వాడితో 'నీది' అన్నదానిని చొప్పిస్తున్నాం. మాటలొచ్చాక ఈ భూభాగం నీది, ఈ ఇల్లు నీది, వీళ్ళు నీవాళ్ళు, మిగతాదంతా పరాయి అని నూరిపోస్తాం. అక్షరాభ్యాసం మొదలయ్యాక చదువుల్లో, ఆటల్లో మిగతా వారితో పోటీపడి వారినందరినీ ప్రక్కనపెట్టి తానే అగ్రేసరుడిగా నిలవాలనే కాంక్షను అతడిలో తీవ్రంగా కలగచేస్తాం. అనతికాలంలోనే పిల్లవాడు తాను వేరని, తానొక ప్రత్యేకమైన వ్యక్తినని మిగతావారి నుండి విడివడనారంభిస్తాడు. అటుపైన తనకు దక్కినవన్నీ తన ప్రయోజకత్వం వల్లనే దక్కాయి అనుకుంటాడు. ఈ భూమ్యాకాశాలకు, ఈ ప్రకృతికి, వీటివేటికీ తాను ఎంత రుణపడి ఉన్నాడో గ్రహించలేడు. వాటివల్ల తనకేమీ బాధ్యత లేనట్లు ప్రవర్తిస్తాడు. తాను పెరిగి పెద్దవడానికి మొత్తం సృష్టి తనకెంత సహాయపడిందో, ఎంత నిశ్శబ్దంగా, మౌనంగా సహకరిస్తూ వచ్చిందో గుర్తించడు. తన అహమే తనకు తెలుసుకానీ, దైవం తనని ఎంతగా అనుగ్రహిస్తూ వచ్చిందో తెలియదు. అందువల్ల ప్రసన్నత అంటే ఏమిటో ఎరుగడు. (బాబా తమ విరాట్ స్వరూపంతో దర్శనమిస్తూ, ప్రసన్నదృష్టితో చూస్తున్నారనిపిస్తుంది అంటారు శ్రీబాబూజీ).

మహాబలిష్టుడైన గజేంద్రుడు మొసలితో పోరాటంలో తానిక నెగ్గలేనని కనుగొన్నపుడు శ్రీమహావిష్ణువును దీనంగా ప్రార్థిస్తూ, తనని తాను సంపూర్ణంగా సమర్పించుకొని శరణుజొచ్చాడు కానీ, మన బోటివారికంత సంపూర్ణవిశ్వాసం కానీ, పూర్తి ప్రపత్తి కానీ ఉండవు. ఒక కంట మనల్ని మనం కనిపెట్టుకుంటూ అవసరమైనప్పుడు మన ప్రయత్నం మీదనే ఆధారపడాలని లోపల అనుకుంటూ, పైకి మాత్రం "నీవే శరణు, నీవే శరణు" అని నటిస్తుంటాం. ఇలాంటి పాక్షిక 'సరెండర్'ని ప్రపత్తి అనరు. పూర్తిగా 'సరెండర్' అయిననాడే జీవితంలో తనకేదీ సంప్రాప్తిస్తే ఏ ప్రశ్నా లేకుండా దానిని స్వీకరించి నేర్వదగినది దాని నుండి నేర్చుకుంటాడు. మానవుడిగా తన జీవితం 'నేర్వడానికే' అని కనుక్కున్నవాడు, ప్రతిసన్నివేశం నుంచి వినమ్రంగా నేర్చుకుంటూనే ఉంటాడు. (జీవితంలో



వ్యాఖ్యతో గురుపాదుకా స్తోత్రములకు వ్యాఖ్యానము ఇచ్చియున్నాను. అంతా వారిద్దరి దయే. ఈసారి కూడా పాఠకులు నన్ను నా గురుపాద సన్నిధికి దగ్గర తీసుకెళ్లగలరని ప్రార్థిస్తాను.

ఎవరి దాకా ఎందుకు, ఎక్కడో విషయాలు దేనికి అని మనం అనుకుంటే బాబాయే స్వయంగా అర్థం తెలిపిన భగవద్గీత శ్లోకముందిగా... "పరిప్రశ్నేనసేవయా" అనే శ్లోకానికి అర్థము, తాత్పర్యము వివరించలేని అంశాన్ని నానాసాహెబ్ చందోర్కర్‌కు బాబా చెప్పినదంతా వ్యాఖ్యానమే. మనమిక అసలు విషయములోకి ప్రయాణిద్దాము. గురుకృప పాఠకులకు నచ్చితే కొన్ని వసంతాలుగా ఈ గురుపాదుకా వ్యాఖ్యము వికసించుతుంది. మీ స్పందనే ఈ వ్యాఖ్య వివరణకు ఆది, పునాది. **సాయి సచ్చరిత – పదమూడవ అధ్యాయములోని ఈ క్రింది అంశాన్ని గమనిద్దాం.**

***మాయ యొక్క అనంతశక్తి :*** బాబా మాటలు క్లుప్తముగాను, భావయుక్తముగాను, అర్థపూర్ణముగాను, శక్తివంతముగాను, సమతూకముతో ఉండెడివి. బాబా మాటల అర్థము దానికి ఇవ్వవలసిన వివరణము అనంతముగా ఉండడం మొదటి లక్షణము. ఉదాహరణకు ఎంతో విస్తీర్ణత గల పర్వతము, పెద్ద వృక్షాన్ని సైతం చిన్న ఫ్రేములో కెమెరాలో బంధించి, ఫోటో తీసి మన చేతికి అందించడం వంటిది. "కొండ అద్దమందు కొంచెమై నిలవదా?" అని వేమనగారనినారు. ప్రపంచము అనే గుమ్మడికాయ అజ్ఞానమంత సైజులో ఉన్నప్పటికీ గురువు ఇచ్చిన జ్ఞానమనే కత్తి అవలీలగా ఛేదించగలదను విషయమును మరువరాదు.

హంసరాజ్ అను బాబా భక్తుడు ఒకరు కలడు. అతనికి ఉబ్బసవ్యాధి ఉంది. ఆ వ్యాధి సోకిన వారు చల్లనివి, పుల్లని పదార్థములు తినరాదు ఆరోగ్యరీత్యా. సహజంగా వ్యాధి సోకిన వారికి ఏఏ పదార్థము నిషేధములో వాటిపైనే ప్రీతి ఎక్కువ. జిహ్వ దానిమీదకే సోకుతుంది. హంసరాజ్ గూడా అంతే బాబా దర్శనానికి వచ్చే ముందు వాటిని సిద్ధం చేసుకొని వచ్చేవారు.

రోగులను రోగాల నుండి రక్షించే రక్షకుడు సాయి. హంసరాజ్ ఇంటిలో ప్రతిరోజు ఒక పిల్లి వచ్చి ఆ పదార్థాలను తాకేది. తనకిష్టమైన దానిని అది దూరం చేసినందుకు కోపగించి హంసరాజ్ ఆ పిల్లిని కొట్టేవాడు. ఒకరోజు బాబా ద్వారకామాయిలో శ్రీమతి కాశీబాయితో పై విషయాన్ని ప్రస్తావిస్తూ "ఒక మూర్ఖుడికి తనకు తోచదు, ఎదుటివారు చెపితే వినడు. ఉబ్బస వ్యాధి నుండి రక్షించాలని ప్రయత్నం చేస్తుంటే నన్ను బాధిస్తున్నాడు" అని అన్నారు. వారి మాటలు క్లుప్తముగానే ఉన్నా, ఎంతో అర్థవంతంగాను, అర్థపూర్ణముగాను, లోతైన భావముతోను కలిపి ఉండెడిది. ***– డా॥ జి.సాయివరప్రసాదరావు, తెనాలి***



## గురువుగారి సాధనలో తొలి సోపానాలు





గురువుగారు తమ అంతరంగిక అనుభవాలగురించి చాలా అరుదుగా ప్రస్తావించేవారు. సత్సంగాలలో అదృష్టవశాత్తు అప్పుడప్పుడూ గురువుగారి వ్యక్తిగత అనుభవాలగూర్చిన ప్రశ్నలు రావడం, వాటికి ఆయన సమాధానాలు ఇవ్వడం జరిగేది. తమ సాధన తొలినాళ్లలో గురువుగారి ఆంతరంగిక జీవితానికి, బాబా దగ్గరకు ఆయన ఎలా వచ్చారు అనే అంశాలకు సంబంధించి గురుదేవులు ఇచ్చిన సమాధానాల సమాహారమైన ఈ మాసం 'శరశ్చంద్రికలు' మనకు ఎన్నో అద్భుతమైన విషయాలను తెలియజేస్తాయి.



**భక్తుడు :** గురువుగారూ! మీ అన్వేషణ ప్రారంభమైన తొలి సంవత్సరాలలో మీరు దేనికోసం అన్వేషిస్తున్నారనే విషయంలో మీకు స్పష్టత ఉండేదా?

**గురువుగారు :** ఉండేది. నాలో ఏదో ఒక వెలితి ఉన్నట్లు అనిపించేది. 'ఏదో' లోపించినట్లుండేది. ఒక విధమైన అసంతృప్తి, విసుగు ఉండేది. వివిధ మార్గాలలో సంతోషం కోసం ప్రయత్నించేవాళ్లను చూసేవాడిని. ఆయా మార్గాలలో వాళ్లు ఆనందాన్ని పొందుతున్నట్లు కనిపించేవారు. అందుకని నేను కూడా నాకు కావలసింది ఈ ఆనందమా, ఆ ఆనందమా? అని ఆయా మార్గాలలో ప్రయత్నించి చూసాను. కానీ ఆ మార్గాలలో ఒక్కటి కూడా నాకు ఖచ్చితంగా ఉపయోగపడదని స్పష్టమయింది.

అయితే రకరకాల దారులను చూపే సూచన బోర్డుల (sign posts) వంటివి ఉండేవి. కొన్నిసార్లు దేనికోసం అన్వేషిస్తున్నానో స్పష్టంగా తెలిసేది. తరువాత హఠాత్తుగా అంతా అస్పష్టమైపోయి నేను తిరిగి అయోమయంలో పడిపోయేవాణ్ణి. ఆ తరువాత, "ఓ, ఇప్పుడు తెలిసింది. చాలా స్పష్టంగా ఉంది!" అనిపించి నా అన్వేషణ తిరిగి ప్రారంభమయ్యేది. కానీ మరికొంతకాలానికి మళ్లీ అస్పష్టత చోటుచేసుకునేది. అలా ప్రయత్నించి విఫలం కావడం, తిరిగి ప్రయత్నించడం, విఫలం కావడం, తిరిగి ప్రయత్నం చేయడం...

**భక్తుడు :** గురువుగారూ! మీరు అంత తీవ్రంగా అన్వేషించడానికి గల కారణం ఏమిటి?

**గురువుగారు :** నాలో సమాధానపడని ప్రశ్నలు చాలా ఉండేవి. ప్రతీదీ ఒక ప్రశ్నలాగా, ఒక చిక్కుముడిలాగా, ఒక మిష్టరీగా (మార్మికంగా) అనిపించేది.



**భక్తుడు :** అంటే ఎలా గురువుగారూ?

**గురువుగారు :** ప్రతి విషయమూ అంతే! నేను ఎందుకు శ్వాస తీసుకుంటున్నాను? ఈ తెలుపు రంగును, ఆ నలుపు రంగును ఎందుకు చూడగలుగుతున్నాను? నేను ఎలా మాట్లాడగలుగుతున్నాను? ఎలా వినగలుగుతున్నాను? ప్రతిదీ ఒక నిగూఢమైన విషయంగా కనిపించేది? నేను ఎందుకు నిద్రపోతున్నాను, ఉదయాన్నే ఎందుకు నిద్రలేస్తున్నాను? ఏం జరుగుతోంది? నాకు ప్రతిదీ ఒక సమస్య ఎందుకైందో చెప్పడం కష్టం (గురువుగారు నవ్వుతూ...) నేను ఈ విషయాలను అర్థం చేసుకునే ప్రయత్నంలో దాదాపు మతిస్థిమితం కోల్పోయిన వ్యక్తిలా మారాను.

నేను ఆ రోజులలో శాస్త్రాలను చదివేవాడిని. జీవితం యొక్క నిగూఢతత్త్వాన్ని గ్రహించామని చెప్పేవారిని ప్రశ్నించేవాడిని. కానీ నేను వాళ్ళను కలిసినపుడు వాళ్ళెవరూ ఈ విషయాలగురించి కనీసం ఆలోచించలేదని, వారికెప్పుడూ ఇవి అసలు మిష్టరీగా అనిపించలేదని, అసలు ఆ ఆలోచనే రాలేదని తెలిసింది. అసలు నా ప్రశ్నలకు సమాధానాలు చెప్పగలిగేవారెవ్వరూ కనపడలేదు. వాళ్ళు కేవలం వేదాంత పరిభాషలో ఏదో ఉపన్యాసాలిచ్చేవారు.

**భక్తుడు :** ఆ వేదాంత సిద్ధాంతాలు మీకు సంతృప్తినివ్వలేదా?

**గురువుగారు :** నిజంగా ఎవరైనా నాకు సంతృప్తికరమైన సమాధానాలు ఇచ్చిఉంటే బహుశా అది బాగుండేదేమో. కానీ వాళ్ళు తాము ఆచరించి అనుభవంలోకి తెచ్చుకోకుండా శాస్త్ర విషయాలను ఊరికే తిరిగి వల్లెవేసి చెప్పేవారు. వాళ్ళు శాస్త్రాలు చదివి వాటిని ఆచరణలోకి తెచ్చుకోకుండానే నిజమని అంగీకరించేసి వాటినే ఒప్పచెప్పేవారు. కానీ నాకు కావలసింది నా సమస్యకు పరిష్కారం. నేను దేన్నుండీ తప్పించుకోవాలని అనుకోలేదు.

**భక్తుడు :** గురువుగారూ! అసలు మీరు ఏం తెలుసుకోవాలనుకున్నారు?

**గురువుగారు :** నాకు అనుభవమవుతున్న ఈ విసుగు ఏమిటి? నాలోని కొరత ఏమిటి? నా జీవితంలోని సమస్యేమిటి? జీవితం పట్ల నేను ఎందుకింత అసంతృప్తితో ఉన్నాను? నేను ఈ పరిస్థితిని ఎదుర్కోవాలనుకున్నాను, దానినుండి తప్పించుకోవాలనుకోలేదు. ఇప్పుడు మన మధ్య జరుగుతున్న ఈ సంభాషణ కూడా ఒక రకంగా వేదాంతమే. జ్ఞానం కోసం చేసే ఏ అన్వేషణైనా వేదాంతమే.

**భక్తుడు :** కానీ గురువుగారూ, మీరు పొందినది మీ ప్రశ్నలకు సమాధానమా? లేక అది ప్రశ్నలను సమూలంగా లేకుండా చేసిందా?





ఈ మూలభావం యొక్క మూలాల్లోకి వెళితే దాని యొక్క ఆనందానుభూతి వ్యక్తమవుతుంది. ఇది కేవలం నిత్యప్రార్థన విషయంలోనే కాదు. ప్రతి అనుభూతిని రగిలించే పవిత్ర ఆధ్యాత్మిక గ్రంథాలన్నీ అని అనుకోవాలి. 'చివరగా' మన గురువుగారే పారాయణ గూర్చి మాట్లాడినారు. మన వారందరిలోను చాలామంది వారు స్వయంగా చెప్పింది వినే ఉంటారు. ఒక వ్యక్తి సాయిసచ్చరిత్ర 1008సార్లు పారాయణ చేసానని చెప్పాడు. మా స్వామివారు ఎంతో సంతోషించారు. అన్ని మార్లు చదివిన ఆ సందర్భంలో నూల్కర్ అనగానే నూల్కరా అతనెవరూ సాయిచరిత్రలో లేడే అన్నాడు. స్వామివారు ఆశ్చర్యచకితులైనారు. ఈ సందర్భాల్లో గురువుగారి భావనను గమనించాలి. పారాయణ అంటే ఇన్నిసార్లు చదివామని చంకలు గుద్దుకోవడం కాదు. రామాయణమంతా విని ఇంతకు రామునికి సీతేమవుతుందంటే ఎలా?

***"గురుపాదుకా" వ్యాఖ్యానము :*** పండితులకు – సాహితీ కోవిదులకు – శాస్త్రాభిలాషులకు మాత్రమే మూలము – మూలములోని అంతరార్థము – భావము – అవగతము కాగలవు. సామాన్యునికి దిక్కేది – దారేది – సంస్కృతంలోని భారతమునకు నీలకంఠీయుని వ్యాఖ్య, సంస్కృతములోని భాగవతానికి శ్రీధరుని వ్యాఖ్య ఎలా అవసరములో ఆయా గ్రంథాలను చదివిన వారికి అర్థము కాగలదు. ఇంకా ఇంకా చాలా గ్రంథములో వ్యాఖ్యానముల ద్వారా వెలుగు చూచినవి.

దీనికి గురువు యొక్క అనుగ్రహము ముఖ్యము. అమ్మ యొక్క అనుగ్రహము వలన "కాళిదాసు" ప్రపంచవ్యాప్త కవియై విరాజిల్లినాడు. కవికుల గురువుగా తెనాలిలోని పాతశివాలయంలోని కాళీమాతను ఉపాసించి తెనాలిరామకృష్ణ వికటకవియైనారు. పైవి పుక్కిట పురాణాలని కొందరు కొట్టివేసినారు. సాక్ష్యాలు, ఆధారాలు లేవు. కాని బాబా చరిత్రలో అలా అనే అవకాశమే లేదు. బి.వి. దేవుగారికి సంస్కృతము నేర్చుకోవాలనే కోర్కె బలంగా ఉండేది. కాని అది అతనికి సాధ్యపడలేదు. బాబా ఆశీర్వాదంతో అతనికి అది సాధ్యమైంది. పంచదశ వంటి వేదాన్త గ్రంథమును తన స్థాయికి మించిన పండితులకు వివరించాడని ఖాపర్డే డైరీ, బాబాచరిత్ర ఉదాహరణలుగా చూపినవి. "శరశ్చంద్రుని" అనుగ్రహం వలననూ కొంత వ్యాఖ్యాన ధోరణి అబ్బినది. నా అంతరంగంలో బాబా, శరద్బాబూజీగార్ల భక్తి శ్రద్ధలు, ప్రేమాభిమానాలు, ఆ మార్గంలో నడిపించునని భావిస్తాను.

ఇంతకన్నా స్వామివారి పాదారవిందాలను ఆరాధించే వారికి నాకన్నా మిన్నయైన ఆలోచనలు రావచ్చు, రావాలి కూడా. నా శ్రమ నన్నింతవరకే నడిపిందని నా తలంపు. గతంలో అంతర్వాహినీ



"బాబా" అని మనసులో అనుకొని కింద పడి ఉన్న ఆ లక్ష రూపాయల కట్ట తీసుకొని నా పని కంప్లీట్ చేసాను.

నేను డబ్బులు పారేసుకున్న ప్లేస్ చాలా రద్దీగా ఉండే ఏరియా, ఎంతోమంది తిరుగుతూ ఉంటారు. అంత పెద్ద మొత్తంలో డబ్బు దొరికితే ఎవ్వరూ ఇవ్వడానికి ఇష్టపడతారు అని నేను అనుకోను. బాబా రక్షణ అంటే అది. ఆ సమయంలో అక్కడ నాకు తెలిసిన అమ్మాయి ఉండటం... ఆ అమ్మాయి నాకు డబ్బులు పడిపోయాయి అని చెప్పడం... ఇది బాబా అనుగ్రహం కాక మరేది!! బాబా ఫీల్డింగ్ కాక మరేది!! **- మురళి, విజయవాడ**

## ముందుగా మనవి (ఈ) మాటలు

గురుదేవులు శరద్బాబూజీగారు పారాయణ గూర్చి వారి భావాన్ని వివరించారు. వేలాది మంది చదివినారు. దాని యొక్క మూల భావాన్ని ఎందరు పట్టుకొనినారో తెలియదు. వారే స్వయంగా పారాయణ గూర్చి "దుఃఖహేతువైన వ్యక్తిత్వపు పరిమితులను దాటించి.... ఆ పాదాలకు పారాణి చేయడమే పారాయణ" అని పారాయణ గూర్చి ముందు స్థాయిలలో వివరంగా వివరించారు గురుదేవులు. పారాయణ ఎలా చేయాలని – ఎందుకు చేయాలని? పారాయణ చేసినందున వచ్చే ఫలమేమిటి? ఫలితమేమిటి అనే అంశాలు లోతుగా వేదాన్త భావనలో శ్రుతి కలిపేవానికి అవగతమైనంత అవగాహన లౌకికునకు అర్థము కాదు. పై భావనంతా! మొదటి స్థాయికి చెందినది. కోర్కెలకు దూరంగా, ఆప్యాయతానురాగాలన్నీ సర్వం తన ఆధ్యాత్మిక దైవం మీద ఉంచగలిగిన వానికి రెండవస్థాయి తేటతెల్లము కాగలదు.

ఈ విధంగానే మూడో స్థాయిని గమనించిన వారికి మూడోభాగమందలి భావన తెలియగలదు. కాని, నేడు పారాయణ చేసేవారు పారాయణ గ్రంథమును ఒక ఏటిఎం కార్డులా భావిస్తున్నారు. గురువుగారిలా దారిచూపేవారు లేక ఈనాడు పారాయణ చేసేవారు కూడా అలానే ఉండిపోతున్నారు.

***సాయిపథంలో మన నిత్యప్రార్థన :***

"ఇది మామూలు ప్రార్థనల వంటిది కాదు. ఇందులోని భావాన్ని హృదయగతం చేసికొని శ్రద్ధగా చదివితే దీని ప్రభావమూ అసాధారణంగానే ఉంటుంది". "భావాన్ని హృదయగతం చేసికొని శ్రద్ధగా చదివితే"....?





**గురువుగారు :** నిజానికి వేదాంతాన్ని చదవడం ద్వారా నేను పామును వదలి పుట్టను కొట్టడం జరిగిందని, వేదాంతంలోని ప్రశ్నలయొక్క సమాధానాలకు, నా ప్రధానమైన సమస్యకు ఎటువంటి సంబంధం లేదనీ తెలిసింది.

**భక్తుడు :** గురువుగారూ! బాబాతో మీకు గల అనుబంధం మీకు ఎప్పుడు స్పష్టంగా తెలిసింది?

**గురువుగారు :** నేను నా గురువును **(ఆచార్య ఎక్కిరాల భరద్వాజ మాష్టరుగారిని)** కలుసుకున్న తర్వాత స్పష్టమైంది.

**భక్తుడు :** అది మాష్టరుగారిని కలుసుకున్న తక్షణమే జరిగిందా?

**గురువుగారు :** అది అంత త్వరగా జరగలేదు. దానికి కారణమేమిటంటే నేనప్పటికే చాలా పుస్తకాలు చదివి ఉన్నాను, చాలా ఆలోచించి ఉన్నాను, చాలా రకాల సిద్ధాంతాలను ప్రోగుచేసుకుని ఉన్నాను. ఒక క్రొత్త విషయాన్ని అప్పటికప్పుడు స్వీకరించడానికి ఇవన్నీ నాకు అడ్డంకులుగా మారాయి. అంతకుముందే రకరకాల సిద్ధాంతాలను ప్రోగు చేసుకున్నందువలన మాష్టరుగారిని కలుసుకునేటప్పటికి నేను ఫ్రెష్‌గా లేను, క్రొత్త విషయాన్ని స్వీకరించడానికి సంసిద్ధంగా లేను.

**భక్తుడు :** బాబాతో అనుబంధాన్ని మీరు ఎప్పుడు గాఢంగా అనుభూతి చెందారు. మీకు అప్పటికే ఉన్న ఈ రకరకాల భావనలు (ఆలోచనలు) వాటికవే తొలగిపోయాయా?

**గురువుగారు :** నిజానికి బాబాతో నా అనుబంధానికి, నాకున్న ఆలోచనలకూ ఎటువంటి సంబంధం లేదు. బాబాతో నా అనుబంధం మేధస్సుకు సంబంధించిన స్థాయిలో ఏర్పడలేదు. అంతేకాకుండా నా ప్రశ్నలకు మూలం, నేను నిస్సారమైన వేదాంత సిద్ధాంతాలను చదవడానికి, వినడానికి చాలా అలవాటుపడి ఉన్నాను. కానీ అవి ఎందుకో నా మనస్సులో నాటుకోలేదు. ఈ వేదాంత గ్రంథాలన్నీ ఆ పరబ్రహ్మతత్వం మనోవాక్కులకు అతీతమైనదని, దానిని అగ్ని దహించలేదని, గాలి కదల్చలేదని, నీరుతో తడపజాలదని, అది ఆలోచనలకు అతీతమైనదని, ఆలోచనలకు అందనిదని చెప్పేవి. ఇదంతా వినడానికి ఎంతో అద్భుతంగా ఉంటుంది. కానీ నేను, "ఒకవేళ అది మనస్సుకు, ఆలోచనలకు అందకపోతే దాన్ని గురించి మాట్లాడటం ఎందుకు? అది అన్నింటికంటే అంత అతీతమైనదయితే దాని గురించి ఆలోచించడం ఎందుకు? మనం ఆ పరబ్రహ్మం గురించి ఎందుకు పట్టించుకోవడం? ఆ పరబ్రహ్మ స్వరూపుడు మన గురించి ఎందుకు పట్టించుకోవాలి? మనం అనవసరంగా ఆయనను ఎందుకు విసిగించడం? ఆయన మనలనెందుకు విసిగించడం? (గురువుగారు నవ్వుతూ...) ఆ భగవంతుణ్ణి హాయిగా ఆయన స్వర్గంలో విశ్రాంతి తీసుకోమనండి. నా సంగతి ఏమిటి? నా సమస్యకు



పరిష్కారం ఏమిటి? నేను నా సమస్యను గురించి అడుగుతుంటే మీరు దేవుడి గురించి మాట్లాడుతున్నారు. నాకు ఆయనతో సంబంధం లేదు. నా సంగతి చెప్పండి, ముందు నా సమస్యకు పరిష్కారం చెప్పండి" అని అడిగేవాడిని. (నవ్వులు...) వాళ్లు దానికి, "మీరెవరో మీకు తెలియకపోబట్టి ఈ సమస్య వచ్చింది" అని సమాధానం చెప్పారు.

"సరే, నా అసలు స్వరూపమేమిటో నాకు తెలియదు, కానీ నేనెవరో నాకు తెలియకపోవడం నా సమస్య కాదు. ఇప్పుడు నేనేమిటో నాకు తెలుసు, దీని గురించి నాకు సందేహం లేదు, నాకు నిరాశానిస్పృహలు. అసంతృప్తి అనుభవమవుతున్నాయి. ఈ సమస్యకు పరిష్కారం ఏమిటి?"

"కాదు, కాదు, నిన్ను నువ్వు పరబ్రహ్మస్వరూపంగా, పరమాత్మస్వరూపంగా భావించుకోవాలి. పరమాత్మకు ఇవేవీ అంటవు".

"అలా నేనెలా అనుకోగలను? నన్ను నేను ఫలానా ఫలానా అని నన్ను నమ్మించుకోమని (హిప్నటైజ్ చేసుకోమని) చెబుతున్నారా? ఇలా నన్ను నేను నమ్మించుకోవడం (హిప్నాటిజం) కోసం నేను మీ దగ్గరకు రాలేదు. ఎవరైనా సమస్య ఉన్నప్పుడు, 'నాకేమీ సమస్యలేదు, సమస్యలేదు, నేను ఎప్పుడూ ఆనందంగా ఉన్నాను, నేను ఎప్పుడూ సంతోషంగా ఉన్నాను,' అనుకోవడం సెల్ఫ్ హిప్నాటిజం. మీరు సెల్ఫ్ హిప్నాటిజం గురించి మాట్లాడుతున్నారు, వాస్తవస్థితిని గురించి మాట్లాడండి"

కానీ మాష్టరుగారితో అది విభిన్నంగా ఉండేది. ఇలా ప్రశ్నించే విధానాన్ని మొత్తం ఆయన వేరే కోణంలో చూసారు. నాకు తెలిసినంతవరకు అలా చూసినవారెవరూ లేరు. ఆయన ఎప్పుడూ నిస్సారమైన తాత్విక సిద్ధాంతాల స్థాయిలో నాతో మాట్లాడలేదు. ఈ సిద్ధాంతాలను తుడిచి ప్రక్కనపెట్టి మూలాలలోనికి వెళ్ళి అన్వేషణ మొత్తాన్ని క్రొత్తపుంతలు తొక్కించారు. అదొక క్రొత్త దృక్పథం, నాకది నచ్చింది. నేను ప్రోగుచేసుకున్న నిస్సారమైన విషయాలన్నీ తొలగిపోయి నా అన్వేషణ తిరిగి ఊపిరిపోసుకుంది, ఆ తరువాత నా అన్వేషణ తిరిగి క్రొత్తగా మొదలైంది.

**భక్తుడు :** మాష్టరుగారు కూడా సాయిబాబా భక్తులేనా?

**గురువుగారు :** అవును, ఆయన సాయిబాబా భక్తులు.

**భక్తుడు :** మాష్టరుగారు మిమ్మల్ని భక్తులుగా పొందారంటే ఆయన చాలా గొప్ప స్థాయి కలిగినవారై ఉంటారు.

**గురువుగారు : ఆయన అంతటివారే. ఆయన సామర్థ్యం అమోఘమైనది. ఆయన చాలా గొప్ప వ్యక్తి. ఆయన నా గురువు. నేను దానికి గర్వపడుతున్నాను.**





బాబా-గురువుగారి యాక్టివిటీలో పాల్గొంటుంటాను. చిన్నప్పటి నుండి బాబా రూపంతో చాలా అనుబంధం ఉండేది. బాబా ఫోటో చూసినా, షిరిడి సమాధి మందిరంలో బాబా విగ్రహం చూసినా ఏదో బాగా తెలిసిన వారిని చూస్తున్న ఫీలింగ్ కలిగేది. అవే ప్రాథమికంగా బాబాకు నన్ను మరింత దగ్గర చేసింది. తరువాత గురువుగారి దర్శనాలు, ఆ మహాత్ముడు నాకిచ్చిన అనుభవాలు బాబాతో నాకున్న బంధాన్ని మరింత పెంచాయి. అది ఆయనమీద నాకు భక్తో, ప్రేమో కానీ, ఆయన ఫోటో ముందర నిలబడి అడిగిందే తడవుగా అన్నీ తీర్చేసేవారు. ఇవి మనం అడిగితే జరిగేవి-మన ఎరుకలో ఉండేవి. మరి మనం అడగకుండా మనకే తెలియకుండా ఇచ్చే వాటినేమనాలి? మన ఏమరుపాటుతోనో, తెలియక జరిగే తప్పిదాల నుండి ఆయన రక్షించే విధానం చూసినప్పుడల్లా-ఎందుకు? ఈయనకు మనమీద ఇంత ప్రేమ, మనం ఎవ్వరిమని ఈ మహానుభావుడు మనల్ని ఇలా దోసిళ్ళలో పట్టి కాపాడుతున్నారు అని అనిపిస్తుంది. అదే ఎక్కడెక్కడో ఉన్న మనల్ని వెతికిపట్టి బాబా పాదాల చెంత కట్టి పడేసిన అనుగ్రహ గురుకృప.

ఒకరోజు డాక్టర్‌గారొకరు అమెరికా వెళుతున్నారు, నాకు కొన్ని డాలర్లు తెచ్చిపెట్టు అని అడిగారు. ఎక్ఛేంజ్ రేటు ఎంక్వయిరీ చేసి కొంచెం రీజనబుల్‌గా ఇచ్చే ట్రావెల్ ఏజెంట్ దగ్గరికి వెళ్ళాను. కొంచెం పని హడావుడిలో ఉండి, వస్తానన్న టైం కంటే గంట ఆలస్యంగా వెళ్లవలసి వచ్చింది. మనసు కొంచెం హడావుడిగా ఉంది. ఎందుకంటే డాలర్ ప్రైస్ టైం టు టైం మారిపోతూ ఉంటుంది, నాకు చెప్పిన ప్రైస్ బెస్ట్ ప్రైస్ కాబట్టి త్వరగా తీసుకోవాలని కొంచెం తొందరలో ఉన్నాను. ఆ క్రమంలో రెండు లక్షల రూపాయలను కవర్లో పెట్టుకొని హడావుడిగా ట్రావెల్ ఏజెంట్ ఆఫీస్‌కి చేరాను, కార్ పార్క్ చేసి క్యాష్ కవర్ తీసుకొని హడావుడిగా కార్ దిగి ఆఫీస్ మెట్లు ఎక్కుతున్నాను. ఇంతలో ఎవ్వరో నన్ను వెనుక నుంచి పేరు పెట్టి పిలిచినట్లు అనిపించి తిరిగి చూసాను. అక్కడ నాకు తెలిసిన హాస్పటల్‌లో పనిచేసే చీఫ్ నర్స్ స్కూటర్ మీద ఆగి ఉంది. తిరిగి ఏమిటండీ? అని అడిగా. ఆవిడ నాతో "సార్ మీ డబ్బులు పడిపోయాయి చూసుకున్నారా?" అని అంది. కింద చూసేసరికి అక్కడ లక్ష రూపాయల కట్ట పడి ఉంది. దాన్ని చూసేసరికి గుండె జారినంత పనైంది. కవర్లో నుండి ఎపుడు కిందపడిందో నేను గమనించ లేకపోయా. వెంటనే ఆ అమ్మాయికి థాంక్స్ చెప్పి 'నన్ను రక్షించావు తల్లీ' అన్నా. ఆ అమ్మాయి తిరిగి "రోగుల ప్రాణాలతోపాటు మీలాంటి వాళ్ళను కూడా మేము అప్పుడప్పుడు రక్షిస్తూ ఉంటాం సార్" అని వెళ్ళిపోయింది.



**గురువుగారు :** బాబాలోని ప్రత్యేకత ఏమిటంటే మీరు బాబా జీవితచరిత్రలో ఎంతగా లోతుకు వెళితే, అంతగా అక్కడ బాబా అనే వ్యక్తి కనిపించకుండా పోతారు. మరేదో ప్రకటమవుతుంది – అది ఆయన ప్రబోధం కూడా కాదు. అప్పటివరకు నీలో అస్పష్టంగా ఉన్నదేదో ఒక రూపాన్ని – చాలా నిర్దిష్టమైన వాస్తవ రూపాన్ని సంతరించుకోవడం మొదలవుతుంది. **బాబా జీవితంలో ప్రతి అంశం ఆయన స్థితికి వ్యక్తీకరణే.** "అంతా బ్రహ్మం, ప్రతి ఒక్కరూ బ్రహ్మమే" అని చాలామంది చెప్పవచ్చు. కానీ ఇవన్నీ కేవలం మాటలు మాత్రమే. బాబా మాత్రం దానిని నిదర్శనాపూర్వకంగా నిరూపించారు, అప్పటికప్పుడు ఆ స్థితిని మనం ఆయనలో చూడవచ్చు. కానీ ఇలా ప్రకటం కావడం ఆయన భౌతికరూపంతో, ఆయన జీవితంతో ప్రారంభమైంది. బాబా రూపమంటారా, అవును. ఇప్పటికీ ఆయన రూపమంటే, ఆయన జీవితమంటే నాకు చాలా ఇష్టం.

**భక్తుడు :** కాబట్టి అది ఆయన రూపంతోనే ప్రారంభమయింది.

**గురువుగారు :** అవును, అది ఆయన రూపంతోనే ముగుస్తుంది కూడా. నిజానికి దానికి అంతంగానీ ఆరంభంగానీ లేవు. నేనేదో స్థితిని దాటానని, ఇప్పుడు రూపాన్ని వదలిపెట్టానని కాదు. ఆయన రూపానికి, ఆయన స్థితికి ఎటువంటి తేడా లేదు. ఎందుకంటే ఆయన స్థితిని వ్యక్తం చేసేది ఆయన రూపమే. నా వరకు రెండింటికీ తేడా లేదు. రూపం, స్థితి రెండూ బాబాలో సంపూర్ణంగా కలసిపోయాయి. ఆయన బోధించినదంటూ ఏమీ లేదు. "ఇదీ బాబా ప్రబోధం" అని నిర్దిష్టంగా మనం చెప్పలేము. కానీ ఆయన బోధించారు. **మనం నేర్చుకోవడానికి, ఆనందించడానికి, అనుభూతి చెందడానికి, ప్రేమించడానికి బాబా దగ్గర చాలా ఉంది.** **– శరచ్చంద్రికలు**

## అనుగ్రహ అమ్మఒడి - దరికి రాలేదు ఏ అలజడి

అనుక్షణం బాబా మనలను గమనిస్తూ ఉన్నారు. మనం ఆయన రక్షణలో ఉన్నామనే భావన జీవితంలో జరిగే వివిధ సంఘటనల వలన మనకు అవగతం అవుతూ ఉంటుంది. ఆ సంఘటనల తాలూకు అనుభవాలే మనల్ని బాబాకు మరింత దగ్గరగా చేసేవి. అలా ఆ అనుభవాల అనుగ్రహాన్ని రుచి చూసినప్పుడు కలిగే ఆనందం–అనుభవించే వారికే సొంతం. అలా ఎందరో ఆయన అనుగ్రహ ధారలలో తడుస్తూనే ఉన్నారు. పంచుకుంటే పెరిగేది అనుభవం తాలూకు ఆనందం అనే భావనతో ఇలా మీతో ఆ మహాత్ముడు ఇచ్చిన అనుభవాలలో ఒకటి.

నేను విజయవాడలో సేల్స్ మేనేజర్‌గా ఉద్యోగం చేస్తుంటాను. అవకాశం ఉన్నప్పుడల్లా





**భక్తుడు :** గురువుగారూ! మీరు మాష్టరుగారిని "ఆయన నా గురువు" అని వర్తమానంలో చెప్పారు.

**గురువుగారు :** అవును. ఆయన నా గురువు. ఆయన అప్పుడు, ఇప్పుడు, ఎప్పుడూ నాకు గురువే.

**భక్తుడు :** మీ సద్గురువు?

**గురువుగారు :** గురువుకి, సద్గురువుకి వ్యత్యాసం ఉన్నట్లు నాకనిపించదు. బాబానే ఆ రూపంలో వచ్చి అవసరమైన దానిని తెలియజేశారనిపిస్తుంది.

**గురువుగారు :** నేను తీవ్రంగా ప్రశ్నించే స్థితిలో మాష్టరుగారి వద్దకు వచ్చాను. అక్కడ నాకు అనుభవం వచ్చిందంటే అది నా ప్రశ్నలు సమాధానపడడం వలన కాదు, అక్కడ మరేదో జరిగింది. ఒకరోజు నేను కూర్చుని మాష్టరుగారితో మాట్లాడుతున్నప్పుడు, ఆయన ప్రక్కనున్న బాబా ఫోటో వైపు చూస్తూ ఉన్నాను. నేను మాష్టరుగారితో మాట్లాడుతున్నప్పటికీ బాబాఫోటో వంక చూస్తూనే ఉన్నాను. అప్పుడు ఏదో జరిగింది! అప్పటివరకు ఉన్న అలజడి, చీకాకు తొలగిపోయింది. ఉదాహరణకు, మీకు మూడు, నాలుగునెలల నుండి తీవ్రమైన తలనొప్పి ఉందనుకోండి. అది ఉన్నట్టుండి మటుమాయమైతే ఎలా ఉంటుంది? అటువంటి అనుభవమది! నాకలా అనిపించింది. అంతకన్నా బాగా నేను దానిని వివరంగా చెప్పలేను. ఏం జరిగిందో నాకు తెలియదు. కానీ నాకు కలిగిన సాంత్వన మాత్రం బాబా చిత్రపటం నుండే వచ్చిందని అనుకున్నాను. కాబట్టి ఆయనను ఇంకా ఇంకా చూస్తూ ఉండాలనుకునేవాడిని. నాకప్పుడు బాబా గురించి ఏమీ తెలియదు. కానీ ఆయనలో ఏదో తెలియని ఆకర్షణ ఉండేది, నేను మాష్టరుగారితో మాట్లాడుతున్నప్పటికీ, వాదిస్తున్నప్పటికీ నా మనస్సు బాబా మీదనే ఉంది. నా మనస్సు మరింతగా మరింతగా శూన్యం కాసాగింది. నేనే వాదిస్తున్నప్పటికీ వేరెవరో వాదిస్తున్నట్టుగా, నా మనస్సు, నా దృష్టంతా బాబా మీదనే ఉండి జరుగుతున్న మొత్తం సంభాషణను నేను గమనిస్తున్నట్లుగా అనిపించింది.

**భక్తుడు :** అయినప్పటికీ మీరు ఆ వాదనను కొనసాగించగలిగారన్నమాట!

**గురువుగారు :** అవును. ఆ వాదన కొనసాగుతూనే ఉంది, నేనెలా వాదించగలుగుతున్నానని నాకు ఆశ్చర్యం వేసింది. ఆ వాదన చాలా బాగుంది. మాష్టరుగారూ ఉత్సాహంగా ఉన్నారు. ఎందుకంటే ఆయనకు అప్పటివరకు అలాంటి ప్రత్యర్థి దొరకలేదు. (గురువుగారు నవ్వుతూ...) ఆయన నన్ను "ఇంకా! ఇంకా! ఇంకా!" అంటూ వాదనకు ప్రోత్సహించారు.



**భక్తుడు :** గురువుగారూ! అప్పుడు మీ వయస్సు ఎంత?

**గురువుగారు :** దాదాపు 18సంవత్సరాలు. ఆ తరువాత నాలో ఏదో మార్పు జరిగింది, ఏదో సాంత్వన కలిగింది. ఆ 'తలనొప్పి' లాంటిది పోయింది. నాకు ఎప్పుడైనా కాస్త అలజడి అనిపిస్తే, మాస్టరుగారి రూముకు వెళ్లాలనిపించేది. నేను మాష్టరుగారి కోసం వెళ్తున్నానో లేక బాబా కోసం వెళ్తున్నానో నాకు తెలియదు.

**గురువుగారు : నేను బాబానే నా గురువుగా భావిస్తాను.** కానీ ఆ రోజుల్లో నాకు దానికి (ఆ భావనకు) ఒక నిర్దిష్టమైన వ్యక్తీకరణ కావాలి. ఆ వ్యక్తీకరణను నేను మాష్టరుగారిలో చూసాను. నాకు స్ఫూర్తినిచ్చింది, బాబా పట్ల నాలో ప్రేమను రగిలించింది మాష్టరుగారు. ఆయనను గ్రుడ్డిగా అనుసరించాలనిపించింది. నాకు దారి తెలీదు, నేను కళ్లు కనిపించని గ్రుడ్డిమనిషి లాంటి వాడిని. మాష్టరుగారి సూచనలను "ఎందుకు? ఎలా?" అని ప్రశ్నించేవాడిని కాదు. నాకు ఒక గురువు దొరికారు. నేను ఆయనను అనుసరించాను. అంతే. ఆ మార్గమేమిటని ఎవరికి కావాలి? ఆయన కర్ర ఒక కొనను పట్టుకున్నారు, నేను మరొక కొనను పట్టుకొని ఆయనను అనుసరించాను. నేను ఆయనను అలా సేవించుకున్నాను నా గురువుతో నేను నడిచే మార్గంలో, ఆయన ఏది చేయమని చెప్పినా నేను దానిని ప్రశ్నించకుండా చేశాను. ఆయన నన్ను పెళ్లిచేసుకోమని చెప్పినప్పుడు కూడా మరో మాట లేకుండా ఆయన చెప్పింది చేశాను. అది నా మార్గం, ఆదీ నేను నడిచిన మార్గం. ఎటువంటి సాకులు, ఎటువంటి ఎంపికలు (ఇష్టాయిష్టాలు) లేవు. ఆయన ఒకరోజు, "శరత్, సత్సంగం బాధ్యత నీది, ప్రతి గురువారం నువ్వు వచ్చి ఏర్పాట్లు చేసి సత్సంగం చెయ్యాలి" అన్నారు. నేను కోటలో ఉండేవాడిని. ప్రతి వారం విద్యానగర్ పోవలసివచ్చేది. వర్షం వచ్చినప్పుడు చిన్న పడవలో ఏటికాలువను దాటవలసి వచ్చేది. నాకు 103 డిగ్రీల జ్వరం వచ్చినా నేను వెళ్లేవాడిని, ఆరు సంవత్సరాలపాటు ఒక్కసారి కూడా వెళ్లకుండా ఆగలేదు. మా అమ్మానాన్నా, "ఏం చేస్తున్నావు నువ్వు? నీకేమన్నా పిచ్చి పట్టిందా? ఇంత జ్వరంతో వర్షంలో విద్యానగర్ దాకా ఎలా వెళతావు, సత్సంగం ఎలా చేస్తావు? తిరిగి ఎలా వస్తావు?" అని కోప్పడేవారు. "మాష్టరుగారు సత్సంగం చెయ్యమని చెప్పారు, నేను వెళ్లాలనుకుంటున్నాను" అని చెప్పేవాడిని. చాలాసార్లు నేనొక్కడినే ఉండేవాడిని. కాని అక్కడ వందమంది ఉన్నట్లుగా ఏర్పాట్లు చేసేవాడిని. సత్సంగంలో మొత్తం పూజా కార్యక్రమాన్ని ఒక్కడినే చేసేవాడిని. భజన, పారాయణ అంతా నేను మాష్టరుగారి వద్దకు వెళ్ళి "నేను (మీ) మార్గంలో నడవాలనుకుంటున్నాను. నాకు మార్గం చూపించండి" అని అడిగిన తర్వాత,





**గురువుగారు :** అవును

**భక్తుడు :** ధ్యానస్థులు కావడం, ధ్యానంలోనే ఉండటం సులభంగా ఉండేదా, గురువుగారూ?

**గురువుగారు :** అవును నిస్సందేహంగా. కానీ ఆ సాధనలన్నీ అవసరం అని నేను చెప్పడంలేదు. నేను అంతకుముందు చెప్పినట్లు, చెట్టు మీద మామిడిపండును పడవరాయితో కొట్టడానికి నేను వేసిన తొమ్మిది రాళ్ళలో ఇవి ఒక రాయిగా ఉపయోగపడ్డాయి. నాకు రాయి విసిరే కళను నేర్పించడానికి సహాయం చేసాయి. నేను ఎన్నో రకాల ధ్యానపద్ధతులను, మంత్ర తంత్ర జపాలను సాధన చేసాను. కానీ నేను మరొక పద్ధతిని కనుగొన్నాను. అందుకనే నేను చేసినట్లే ఈ సాధనలన్నీ చేయమని మీకు చెప్పను. **ఎందుకంటే అదే లక్ష్యాన్ని చేరుకోవడానికి వీటన్నింటికంటే సులభమైన మార్గాన్ని కనుగొన్నాను.** అయినా మీరు ఇవన్నీ చేస్తానంటే చెయ్యండి, ఇబ్బందిలేదు. (గురువుగారు నవ్వుతూ...)

**భక్తుడు :** గురువుగారూ! మీరు ఆ పరిష్కారాన్ని కనుగొన్న తరువాత ఏం మార్పు వచ్చింది?

**గురువుగారు :** ఏం మారలేదు. ఏం జరిగిందనేది మాటలలో వ్యక్తం చేసేది కాదు. నాలో ఏది కొరతగా ఉన్నదో నేను దానిని పూండీలో పొందాను, నా అన్వేషణ ముగిసింది. ఏదో జరిగిందని కాదు. జరిగింది మాత్రం ఇది, నాకు అది సరిపోయింది. నా సమస్య తీరిపోయింది, ఆ తరువాత ఇక అన్వేషణంటూ ఏమీ లేదు. సంఘర్షణ ముగిసింది. నాలో ఉండిన అసంతృప్తి, విసుగు తరువాత లేవు. ఈ వివరణ సరిపోతుందనుకుంటాను. (నవ్వులు...)

**భక్తుడు :** గురువుగారూ! మీరు సాయిబాబా భక్తులు కావడానికి గల కారణమేమిటి? మిమ్మల్ని బాబా వద్దకు ఆకర్షించేందేమిటి?

**గురువుగారు : నాలో అస్పష్టంగా, అవ్యక్తంగా ఉన్న పరిపూర్ణత్వ భావనకు వాస్తవరూపం బాబా. "నేను ముందు బాబాను ప్రేమిస్తే, ఆయన నా సద్గురువైతే, ఆ తరువాత బాబా నన్ను తరింపచేస్తారు" – బాబా గురించి నేనిలా ఎప్పుడూ అనుకోలేదు. మీరు అర్థం చేసుకోవడానికి ఈ పదాలను వాడుతున్నాను. నాకు ఇటువంటి ఆలోచనలు (భావనలు) లేవు. నాకు బాబా రూపాన్ని, ఆ ఆనందస్వరూపాన్ని చూడడమంటే ఇష్టంగా ఉండేది, అంతే. బాబా రూపం నాకు ఆనందాన్నిచ్చేది. ఎందుకనడిగితే, అది నాకు తెలియదు. కానీ నేను చాలా ఆనందంగా ఉండేవాడిని.**

**భక్తుడు :** మీరు ఇష్టపడింది బాబా రూపాన్నా, ఆయన కనిపించిన విధానాన్నా లేక ఆయన జీవితచరిత్రనా?



వెళ్ళిపోయేవాడిని. మా నాన్నకు స్థానిక సినిమాహాలు ఓనర్లైన ఒక స్నేహితుడుండేవాడు. మా నాన్న సినిమా హాలుకు వెళ్ళి ఆయనతో కలిసి కూర్చొని కాలక్షేపం చేసేవారు. ఒకవేళ నేను మా నాన్నను కలిసి ఏదైనా చెప్పాలంటే, నేను సినిమాహాలుకు వెళ్ళవలసి వచ్చేది – కానీ నా నియమం ప్రకారం నేనేమో సినిమాహాలు లోపలికి వెళ్ళను! బయట నిలుచొని మా నాన్నను బయటకు రమ్మని వాచ్‌మెన్‌కు చెప్పి పంపేవాడ్ని. అక్కడుండే వాళ్లంతా మా నాన్నతో, "చూడు, భక్తుడు వచ్చాడు. బయటకు వెళ్ళు, లోపలికి వస్తే అతడు అపవిత్రమవుతాడు, చెడిపోతాడు" అని హాస్యమాడేవారు. (నవ్వులు...)

**భక్తుడు :** మీ మనస్సులో ఇటువంటి ఆలోచనలు రావడానికి కారణమెవరు?

**గురువుగారు :** శాస్త్రాలన్నీ వైరాగ్యం యొక్క ప్రాముఖ్యత గురించి చెబుతాయి. మా గురువుగారు కూడా ప్రోత్సహించేవారు. కేవలం పుస్తకాలలో చదవడమే కాదు, దానిని ఆచరణలో పెట్టడం! అదీ వైరాగ్యమంటే. దాని అంతు చూడాలి. ఇటువంటి ఆలోచనలు నా మనస్సులో పడడానికి శాస్త్రాలు కారణం. కొంతమంది వాటిని పనికిరాని విషయాలన్నప్పటికీ, నిజానికి నా మీద అవి సత్ప్రభావాన్నే చూపాయి.

**భక్తుడు :** ఇది జరిగింది ఎప్పుడు గురువుగారూ?

**గురువుగారు :** అది 1972 నుండి దాదాపు 78, 79 వరకు. అందరూ నేను పిచ్చివాడినైపోయానని అనుకునేవారు. అంతకుముందు నేను కాలేజీ రాజకీయాలలో, నాటకాలలో, సాహిత్య సంబంధ విషయాలలో చాలా చురుకుగా ఉండేవాడిని. అందరూ, "ఎంత మంచి పిల్లవాడు, ఇప్పుడు ఎలా అయిపోయాడో చూడు" అనేవారు. (నవ్వులు...)

**భక్తుడు :** ఇది పూండీ నుంచి వచ్చిన తరువాత విషయమా గురువుగారూ?

**గురువుగారు :** పూండీకి వెళ్లకముందు విషయం. పూండీ నుండి వచ్చిన తరువాత కూడా కొంతకాలం ఈ స్థితి కొనసాగింది. చాలా తక్కువ నిత్యావసరాలతో జీవించేవాడిని. దేనిగురించి ఆందోళన చెందేవాడిని కాదు. నేను తిరువణ్ణామలైలో అలాగే గడిపాను. జేబులో ఒక్క రూపాయి కూడా లేకుండా, కనీసం చేతిసంచి కూడా లేకుండా ఉన్నాను. ఇవేవీ లేకుండా కూడా నేను ఆనందంగా ఉండగలననిపించింది. ఇలా జీవించడం వల్ల నాకు అంతటి ఆత్మవిశ్వాసం వచ్చింది. నేను చేసిన సాధనలు ఇదేగాక మరేదో కూడా ఇచ్చాయి.

**భక్తుడు :** మరేదో అంటే? అవి మిమ్మల్ని మరింతగా స్వీకరించడానికి సంసిద్ధులను చేసాయా?





ఆయన ప్రతిమాట, ప్రతి సూచనా అది ఆధ్యాత్మికమైనా లేదా ప్రాపంచికమైనా అది నాకు శాసనం.

**భక్తుడు :** సత్సంగానికి వెళ్లడం మీకు ఇష్టంగానే ఉండేదా?

**గురువుగారు : మాస్టారుగారి సూచనను అనుసరించడమే ఆనందం.** అందుకే అలా సత్సంగానికి వెళ్ళడం నాకు ఆనందంగా ఉండేది. అంతకు మించిన ఆనందం ఇక ఏముంది? మాస్టరుగారు తమ ఆదేశంతో నన్ను అనుగ్రహించారు. ఆ అవకాశం నాకు దక్కింది. నేను అదృష్టవంతుణ్ని.

**భక్తుడు :** గురువుగారూ! అది చాలా గొప్ప పరిణతిని సూచిస్తుంది.

**గురువుగారు :** అది పరిణతిని సూచిస్తుందో లేక వెర్రితనాన్ని సూచిస్తుందో నాకు తెలీదు. (గురువుగారు నవ్వుతూ..) నేను ఆదర్శాన్ని అనుసరించాను. అక్కడ మనం అనుసరించే వ్యక్తి కాదు, ఆదర్శం ముఖ్యం.

**భక్తుడు :** మాస్టరుగారితో మీ అనుబంధం మొదలైన తొలినాళ్ళలో ఆయన మీకు బి.వి.నరసింహ స్వామిగారు రచించిన రమణమహర్షి జీవితచరిత్రను ఇచ్చారు. రమణుల జీవితచరిత్ర మీకు ఏం తెలియజెప్పింది? రమణుల జీవితం నుండి మీరు నేర్చుకున్న అంశాలేంటి?

**గురువుగారు :** ప్రేమ! అంకితభావం! ఏ బంధరహితమైన స్థితి కోసమైతే నేను పరితపిస్తున్నానో ఆ స్థితిని సాధించవచ్చునని రమణమహర్షి జీవితం నిర్దిష్టంగా తెలియజేసింది. "ఓ, ఇది సాధ్యమవుతుంది!" అన్నది రమణులు నాకిచ్చిన స్పష్టత, ప్రోత్సాహం. మనిషిగా ఆ స్థితిని పొందడం సాధ్యమని వారు చూపించారు. నన్ను ఆకర్షించింది ఆయన బోధనలు కాదు, ఆయన జీవితం. ఆయన జీవితం వాస్తవికమైనది. అందరూ వేదాంతం గురించి, చాలా గొప్ప వేదాంతం గురించి మాట్లాడుతారు, కానీ అలా జీవించరు! **అన్ని బోధలకూ మూర్తీభవించిన రూపమే భగవాన్ రమణులు.**

**భక్తుడు :** మీ అన్వేషణలో పూండీస్వామి ప్రభావం ఎటువంటిది?

**గురువుగారు :** నా గురువు వెళ్ళమన్నారు కనుకనే నేను పూండీస్వామి వద్దకు వెళ్ళాను. ఆయన చెప్పారు, నేను చేసాను అంతే. అక్కడ మరే ఇతర కారణం లేదు. నేను దానికంతటికీ బాబానే కారణమని చెబుతాను. నన్ను పూండీస్వామి వద్దకు పంపించింది బాబా, అక్కడ పొందవలసింది ఏదైనా ఉంటే దానిని ఇవ్వవలసిన పూర్తి బాధ్యత ఆయనదే. ఆ అనుభవం పూండీలో శ్రీస్వామి ద్వారా వచ్చింది కాబట్టి నాకు పూండీతో ఆ అనుబంధం ఉంది. కానీ అదంతా బాబా అనుగ్రహ ఫలితమేనని నేను అనుకుంటున్నాను. ఇక్కడ చాలా సూక్ష్మమైన తేడా ఉంది, దానిని అర్థం చేసుకోవడం



మీకు చాలా కష్టం. నా గురువును నేను గుడ్డిగా అనుసరించానని నేను చెప్పినపుడు, **ఆ గ్రుడ్డితనానికి మరో విభిన్నమైన గుణం ఉంది. అది వివేకం లేని గ్రుడ్డితనం కాదు, నాకున్న పూర్తి వివేకంతో నేను ఆయనను అనుసరించాను.** వివేకాన్ని చంపుకోవడం నా వ్యక్తిత్వ లక్షణం కాదు. నేను మాష్టరుగారిని వెయ్యి ప్రశ్నలు అడిగాను, వెయ్యిసార్లు ఆయనతో చర్చించాను, మేము దాదాపు పోట్లాడుకునేవాళ్ళం, కానీ అంతిమంగా నేను ఆయన చెప్పినట్లే చేసేవాడిని.

**భక్తుడు :** గురువుగారూ! మాష్టరుగారు మిమ్మల్ని అర్థం చేసుకున్నారని చెప్పారు. అంతేకాకుండా ఆ రోజుల్లో మీరు కలుసుకున్న వారందరిలో కేవలం ఆయన మాత్రమే మీ సమస్యను అర్థం చేసుకున్నారన్నారు. మాష్టరుగారు మిమ్మల్ని ఏ విధంగా అర్థం చేసుకున్నారు? అప్పటి మీ సమస్యేమిటి?

**గురువుగారు :** ఆ సమస్య గురించే మీరెందుకు ఆలోచిస్తున్నారు? ఆ పాత సమస్యనే పట్టుకొని ఎందుకు వ్రేలాడుతున్నారు? (గురువుగారు నవ్వుతూ..) అది ఇప్పుడు నా సమస్య కాదు. దాని గురించి ఇప్పుడు నేను చెప్పడం పొరపాటవుతుంది. ఎందుకంటే మీరు దానిని మీ సమస్యగా చేసుకోవడానికి ప్రయత్నిస్తారు. నాకు వాస్తవమైన ఒక సమస్యను మీ మీద రుద్దదలచుకోవడంలేదు. నాకో సమస్య ఉండేది, నేను దానిని పరిష్కరించుకున్నాను. నా గురువు నాకు సహాయం చేసారు. నా సమస్య అందరికీ ఉండేటటువంటిది కాదు. అదీ అసలు సమస్య. (నవ్వులు...) అందుకే పరిష్కారం! చెప్పేవాళ్ళ సంగతి అటుంచి కనీసం నా సమస్యను అర్థం చేసుకునే వాళ్ళెవరో కనుక్కోవడం కూడా చాలా కష్టమైంది. మాష్టరుగారు నా సమస్యకు పరిష్కారం చెప్పారని నేను చెప్పలేదు. ఆయన నా సమస్యను సానుభూతితో అర్థం చేసుకున్నారు. అలా అర్థం చేసుకోవడం నన్ను ఆయనవైపుకు ఆకర్షించింది. ఆ రోజులలో నేను, అందరూ అదృష్టవంతులనీ, నేనొక్కడినే దురదృష్టవంతుడననీ అనుకునేవాడిని. మిగతా వాళ్లందరూ వాళ్ల సమస్యలన్నీ పరిష్కారమయ్యి ఎంతో సంతోషంగా ఉన్నట్లు కనిపించేవారు. నేనొక వెర్రివాడిలాగా వీటన్నింటి గురించి ఎందుకు ఆలోచిస్తున్నాను అనుకునేవాడిని (గురువుగారు నవ్వుతూ...)

**భక్తుడు :** గురువుగారూ! యువకులకు సాధారణంగా ఉండే సినిమాలు, ఆటలు, అమ్మాయిలు మొదలైన ఆకర్షణలు మీకు ఉండేవి కావా?

**గురువుగారు :** అంతకు ముందు (బాబా వద్దకు రాకముందు) ఈ ఆకర్షణల పట్ల అందరూ అంతగా ఆకర్షింపబడటానికి కారణమేమిటా అని వాటిని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించేవాడిని. అప్పుడు





నాకు అటువంటి ఆకర్షణలు ఉండేవి. ఆ తరువాత నేను బాబా వద్దకు వచ్చాక అన్ని రకాల సాధనలు, అవి ఎంత కఠినమైనవైనా సరే వదలక చేయడం మొదలుపెట్టాను. నాకు సాధన చేయడమంటే, ఉదాహరణకు బాబా నామం చెయ్యడం అనుకోండి, దానిని ఇరవై నాలుగు గంటలు చెయ్యడం. నిద్రపోతున్నా అది కొనసాగాలి. నేను కాలేజీకి వెళుతూ ఉండడంతో ధ్యానానికి పూర్తిగా సమయాన్ని కేటాయించలేకపోయేవాడిని. కానీ సెలవురోజుల్లో ఇరవైనాలుగు గంటలూ ధ్యానంలో కూర్చొని ఉండేవాడిని. ఆ సాధన గురించి పూర్తిగా తెలుసుకునే ఆ ప్రయత్నంలో కనీసం కదిలేవాణ్ణి కూడా కాదు. నేను ఇలా ప్రతి సాధననూ సంపూర్ణంగా చేసి అది నా సమస్యను పరిష్కరిస్తుందో లేదో చూసేవాడిని. నాకు చాలా రకాల అనుభవాలు వచ్చి ఉండవచ్చు. కానీ అవేవీ నాకు సంతృప్తిని కలిగించలేదు. ఆ రోజులలో నేను సినిమాలకు వెళ్ళేవాడిని కాదు. కనీసం నేను సినిమా పోస్టర్‌ను సైతం చూసేవాడిని కాదు! (గురువుగారు నవ్వుతూ...) నేనంత కఠినంగా ఉండేవాడిని. చెప్పులు వేసుకునేవాడిని కాదు. చలికాలంలో సైతం వేకువఝామున మూడు గంటలకే నిద్రలేచి చన్నీళ్లతో స్నానం చేసేవాడిని. నీళ్ళు ఇంకా చల్లగా ఉండడానికి కుండలో పోసి ఆరుబయట పెట్టేవాడిని.

**భక్తుడు :** మీరు అలా ఎందుకు చేసారు గురువుగారూ!

**గురువుగారు :** ఊరికే అలా చెయ్యాలనిపించేది. ఆధ్యాత్మిక జీవితానికి వైరాగ్యం అవసరం అని శాస్త్రాలు చెప్పేవి. అన్నిరకాల భౌతిక సౌఖ్యాలను జయించాలని వాటిలో చెప్పబడి ఉండేది. అందుకని, “చివరికంటా వెళ్ళి, వీటిని సంపూర్ణంగా చేసి ఏం జరుగుతుందో చూద్దాం” అనుకున్నాను. నేను కావాలని ఉద్దేశ్యపూర్వకంగా శరీరాన్ని చిత్రహింసలకు గురిచేసే పనులను చేసేవాడిని.

**భక్తుడు :** అలా చెయ్యడం వలన ఏం జరిగింది గురువుగారూ?

**గురువుగారు :** ఏం జరగలేదు. (గురువుగారు నవ్వుతూ..) ఆ తరువాత ఎటువంటి సౌకర్యాలు లేకపోయినా నాకు ఫరవాలేదనిపించింది – ఇదొక్కటే దానివల్ల చేకూరిన ప్రయోజనం.

అంతకుముందు నేను స్కూల్లో కుస్తీ ఛాంపియన్‌గా ఉండేవాడిని. (నవ్వులు..) కుస్తీ నాకు బాగా నచ్చిన ఆట. ఆ రోజులలో బాక్సింగ్, కరాటే ఇటువంటివేవీ లేవు. కేవలం కుస్తీ మాత్రమే అందుబాటులో ఉన్న యుద్ధక్రీడ. ఆ తరువాత 6 సంవత్సరాలపాటు నేను చేసిన ఇటువంటి సాధనల వలన ఆరోగ్యం పూర్తిగా దెబ్బతిన్నది. నేనెంత కఠినంగా ఉండే వాడినంటే వారపత్రికల కవర్‌పేజీలను కూడా చూసేవాడిని కాదు. అవి నా కళ్ళముందున్నా సరే, కావాలని వాటిని చూడకుండా